ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

నవంబర్ 2, 2014

మానవా ! మారవా?!

అమీర్ 'పి.కె'

విభిన్నమైన పాత్రలను అవలీలగా పోషించగల నటుడు అమీర్‌ఖాన్. ఏ చిత్రం చేసినా ఏ పాత్ర వేసినా ఆ క్యారెక్టరే కనిపిస్తుంది తప్ప అమీర్ కాదు. అందుకేనేమో అతని సిన్మా కోసం అభిమానులు అంతగా ఎదురుచూస్తుంటారు. మీ ఎదురుగా వున్నవన్నీ త్వరలో విడుదల కానున్న అమీర్ ఖాన్ సినిమా 'పి.కె.' తాలూకు చిత్రాలే. ఇందులో అమీర్ మొత్తం తొమ్మిది పాత్రలు పోషిస్తున్నట్టు వినికిడి. వాటిలో ఒకానొక పాత్ర పేరు 'పి.కె'. అసలు పేరేంటనేది మాత్రం రహస్యం. పైగా పి.కె గొప్ప పాన్ ప్రియుడట. సినిమా షూటింగ్ సందర్భంగా ఇప్పటికి మొత్తం వెయ్యి పాన్లు తిన్నాడని చెప్తున్నారు. అంతెందుకు సెట్ మీద ఏకంగా ఒక పాన్‌వాలానే ఏర్పాటు చేసుకున్నారు. భోజ్‌పురి యాస కోసం అమీర్ రెండేళ్లపాటు శిక్షణ కూడా తీసుకున్నాడు. ట్రాన్సిస్టర్ మాత్రమే పట్టుకున్న అమీర్ నగ్న రూపాన్ని చిత్రం తొలి ఫొటోగా విడుదల చేశారు. అది పెద్ద చర్చనీయాంశమే అయింది. అన్నట్టు ఇందులో అమీర్‌తో పాటుగా అనుష్క శర్మ, సంజయ్ దత్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి దర్శకత్వం రాజ్‌కుమార్ హిరాని.



ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

అప్పుల కుప్పలు

'అప్పు రేపు' అనేవారు. అప్పు చేయడాన్ని నామోషీగా భావించేవారు. తప్పు చేస్తున్నట్టు కుంచించుకుపోయేవారు. అది ఒకనాటి మాట! ఇవాళ అప్పు చేయలేని వాడు చేతగానివాడే. సింపుల్‌గా చెప్పాలంటే ... సర్వకాల సర్వావస్థల్లోను సర్వరోగ నివారిణి అప్పు అయి కూర్చుంది.

చిన్నారులను బళ్లో వేయాలన్నా, కాలేజీ ఫీజు కట్టాలన్నా, పెళ్లి చేయాలన్నా, బండి కొనాలన్నా, ఇల్లు కట్టాలన్నా, వైద్యం చేయించాలన్నా, సాగు చేయాలన్నా, చావు చేయాలన్నా, నచ్చిన వస్తువులు సొంతం చేసుకోవాలన్నా ... జేబులో డబ్బు వుండక్కర్లా! అన్నిటికీ అప్పులిచ్చేవాళ్లు సిద్ధంగా వుంటున్నారు. 'అప్పు తీస్కో బాస్. జల్సా చేస్కో బ్రో' అంటూ భుజాలు చరుస్తున్నారు. అప్పు లేకపోతే ఊపిరాడనంతగా అలవాటు చేసేశారు. క్రెడిట్ కార్డులు, లోన్లు, రుణాలు, చిట్టీలు...పేర్లు-పద్ధతులు ఏవైనా అవన్నీ అప్పుకు పర్యాయ పదాలే. ఒక్క మాటలో చెప్పాలంటే అప్పనేది పెద్ద వ్యాపార వస్తువైపోయింది.

అప్పు మాంచి కథా వస్తువు కూడా. ఇప్పటికే అప్పు చుట్టూ అల్లిన కథలు, తీసిన సినిమాలు, సృష్టించిన పాత్రలు ఎన్నో! రీల్ రియాల్టీ అనండి మరేదైనా అనండి. అప్పు మాత్రం నిజం. వారసత్వంగా ఆస్తులు అందుకునే రోజులు పోయి అప్పులు మాత్రమే పుచ్చుకునే కాలం వచ్చేసింది.

సాధారణ ఉద్యోగి ఇంటికోసం అప్పు చేశాడో! అది తీరడం...రిటైర్మెంట్ ప్రాప్తించడం ఒకేసారి జరుగుతుంది. ఆ దశలో కూతురు పెళ్లికో, కొడుకు ఉద్యోగానికో ఇంటి మీద అప్పు చేసి వీధిన పడడం కామన్ దృశ్యం.

అందరికీ అన్నం పెట్టే రైతన్న రుణగాథలు, బాధలు, ఆత్మహత్యలు చూసి హృదయం ద్రవించి పోవాల్సిందే. ఇహ లోకం నుంచి విముక్తుడైనా రుణ విముక్తుడు మాత్రం కాలేడు. చచ్చి బతికిపోయిన రైతును విడిచి పెట్టి... అతని కుటుంబాన్ని పట్టి పీడిస్తుందా రుణ రాకాసి.

ఇంట్లో పంచదార నిండుకుంటే పక్కింటికి పోవడానికి నిక్కీనీలిగీ కదిలేవారు ఇల్లాళ్లు. అలాంటి ఆడవాళ్లను మైక్రోఫైనాన్సుల ఉచ్చులో బిగించి చోద్యం చూస్తున్న పాపం నేతలదే.

కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు చేసిన అప్పులు లెక్కబెట్టడం కష్టమే. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్... ఒకటేమిటి దేశానికి అప్పులివ్వడానికి అంతర్జాతీయ సంస్థలు క్యూ కడతున్నాయి. వాటి అప్పులతోబాటు వచ్చే షరతులు షరామామూలే. కేంద్రం తీసుకున్న అప్పు భారతీయులందరికీ పంచితే ఒక్కొక్కరి నెత్తిన లక్షకు పైనే వుంటుందట. అదీగాక రాష్ట్ర ప్రభుత్వ అప్పు, స్థానిక సంస్థల అప్పు... ఇలా భారం ...అందరిమీదా తలకింత చొప్పున ఎప్పటికప్పుడు పడిపోతుంటుంది. ఇవి కాక మనం వ్యక్తిగతంగా చేసే అప్పులు. వెరసి మనందరం అప్పుల కుప్పలమే.

కొత్తగా గద్దెనెక్కిన నేతలదీ అదే దారి. రుణ దాతలు ... యథా ప్రకారం అడ్డగోలు ఆంక్షలు, నిబంధనలు విధించడం...విపణి వీధి తలుపులు బార్లా తెరిపించడం... మన రైతులు, వ్యాపారస్తుల నోట్లో మన్ను కొట్టడం... ఒకదాని తర్వాత ఒకటిగా అలా జరిగిపోతాయి.

అయినా సరే ... అప్పును ఒద్దంటారా ఎవరైనా!

◆ మనలో మాట



టపా

బాల బంధు...

ఈవారం నోబెల్ గ్రహీతలైన మలాలా, కైలాశ్ సత్యార్థిల గురించి కవర్‌స్టోరీ ఇవ్వడం సందర్భానుసారంగా ఉంది. ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సాహస బాలిక మలాలా ... ఆడపిల్లల విద్యాహక్కు కోసం చిన్న వయసులోనే తాలిబన్ల చేతిలో గాయాలపాలైంది. ఆమె చేతిరాతలు తాలిబన్లను సైతం గడగడ లాడించాయి. అలాగే టీవీ ఇంటర్వ్యూలలోనూ ... తాలిబన్లకు వ్యతి రేకంగా మాట్లాడడం... చూస్తుంటే ఆమె ధైర్యానికి ఎవరైనా సరే సలామ్ చేయాల్సిందే. కైలాశ్ సత్యార్థి కూడా బాల్యంలోనే పోరాట బీజాలు వేసుకున్నాడు. చెప్పులు కుట్టే పిల్లవాడు.. ఇంకా ఇతర పనులు చేసే పిల్లలు ఎందుకు చదువుకోలేకపోతున్నారని తనను తానే ప్రశ్నించుకోవడమే కాకుండా పరిష్కార మార్గాలను కూడా వెతికాడు. తనకు చేతనైనంత సాయం చేయడం... తోటివారిని కూడా తను చేపట్టే కార్య క్రమాల్లో పాల్గొనేలా చేసి.. నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యాడు. ఇవేవో ఒక్కరోజులోనో.. ఒక్కపూటలోనో సాధించిన విజయాలు కాదు. బాలల హక్కుల కోసం పోరాడుతున్న వారికి ఈ పురస్కారాలు దక్కడం ఆనందించాల్సిన విషయం.

-జి. గోపాలకృష్ణ, విజయవాడ.

విడాకుల పాట్లు

'విడాకుల కోసం శతకోటి పాట్లు' ఆకర్షించింది. వివాహాల కోసమే శతకోటి పాట్లనుకుంటే... ఇక విడాకుల కోసం సహస్ర కోటి అవస్థలుగా ఉన్నాయనిపించింది అది చదువుతుంటే. విదేశాల్లో వివాహ వ్యవస్థ గురించి ఎంతోకొంతైనా తెలిసే ఉంటుంది. అంటే సినిమాలు, ఇక పత్రికలు ఇలా.. దేనిద్వారైనా తెలుసుకోవచ్చుగానీ.... మరీ ఇంత బలహీనంగా ఉంటాయని ఊహించలేం. ఇలా ఉంటే మానవ సంబంధాలు, ముఖ్యంగా పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో స్పష్టంగా అర్థమౌతోంది. అట్లాంటిస్ దీవి అందాలు, దాని ప్రత్యేకతలు చదివించాయి.

- డి. కృష్ణమూర్తి, విశాఖ.

వృద్ధాశ్రమాలా!

'మనిషి ఆశాజీవి' కథ నేటి కాలంలో ముసలివాళ్లను ఎలా చూస్తున్నారో కళ్లకు కట్టింది. ఎంతో ఆస్తి ఉంటుంది. కానీ చివరి దశలో వాళ్లను చూడ్డానికి మనుషులుండడం లేదు. కన్నబిడ్డలే వాళ్లను గాలికొదిలేస్తున్నారు. అంటే వారి ఉద్యోగ కారణాల రీత్యాగానీ... ఇంకేమైనా సమస్యల వల్లగానీ చూడలేకపోవచ్చుగానీ పెద్దవాళ్ల పరిస్థితి కూడా కుటుంబ సభ్యులు అర్థం చేసుకొని మెలిగితే వారిని వృద్ధాశ్రమాలవైపు వెళ్లకుండా కళ్లెదుట ఉంచుకోగలుగుతారు. నిజం చెప్పు కోవాలంటే మనిషి విలువ ఆ మనిషి ఉన్నప్పుడు తెలియదు.. లేనప్పుడే తెలుస్తుంది. ఇది జీవిత సత్యం కూడా! అందుకే కన్నవారిని భారంగా.. బాధగా చూడకూడదు. ఎప్పుడూ తల్లిదండ్రుల ఒడిలో ఒదిగిపోయే బిడ్డల్లాగే చూడాలి.

- బి. సుధారాణి, చిత్తూరు.

ఏం ఐడియా?!

'చీరల లైబ్రరీ' మహిళల మనస్సుకు తగ్గట్టుగా ... ఓ మహిళే స్థాపించడం బాగుంది. ఎందుకంటే ఖరీదైన చీరలు కట్టుకోవాలని ఉన్నాగానీ ఆర్థికపరమైన సమస్యల వల్ల వాటికి దూరంగా ఉండి పోవాల్సి వస్తుంది. కానీ ఈ చీరల లైబ్రరీ వల్ల అలాంటి ఖరీదైన చీరలను అద్దెకు తీసుకొచ్చుకొని వాటిని కట్టుకొని ఆనందించి, మరలా వాటిని వారికి తిరిగి ఇచ్చేయడంతో పార్టీల్లో హుందాగానూ కనిపించవచ్చు.. ఇటు డబ్బులకు డబ్బులూ సేఫ్.. ఐడియా బాగుంది!

- ఆర్. శ్రీలక్ష్మి, గుంటూరు.

ఈ సంచికలో....

మానవా! మారవా?!

కవర్‌స్టోరీ 8

రాకెట్లను ప్రయోగిస్తున్నాం. ఆకాశహర్మ్యాలను నిర్మించుకుంటున్నాం. కార్లలో, విమానాల్లో ప్రయాణిస్తున్నాం. చిన్నారులకు మంచి మంచి స్కూళ్లలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం. అయితే... పౌర వర్తన విషయంలో మాత్రం వేలెత్తి చూపించుకునేలా వున్నాం. మనం నివసిస్తున్న వీధులు, పని చేస్తున్న కార్యాలయాలు, ఉపయోగిస్తున్న రోడ్లు, బస్సులు, వాటికి పెట్టుకున్న నిబంధనలు, చేస్తున్న ఉల్లంఘనలు, నిర్లక్ష్యాలు... అదే చెప్తున్నాయి. ఈ విషయంలో మాత్రం అందరూ సమానులే. జాతి, మత, వర్గ, వర్ణ, పేద, ధనిక...అన్న బేధాలేం లేవు.

సమ్‌థింగ్ స్పెషల్ 4
ఉప్పు ముప్పు ఎంత?
రుచి 5
ఇడ్లీ ఇలా కూడా...
కథ 6
గోంగూర బేరం
నవ్వుల్- పువ్వుల్ 7
సందర్భం 14
జీవిత నాటకం - కన్యాశుల్కం
సీరియల్ 16
ప్రేమ- విప్లవం
వింతలోకం 19
కేశాల కారు
కొత్త పుస్తకాలు 20
అక్షరంతో పోరాట 'విన్యాసం'
బాలనేస్తాలు 22
కవిత్వమ్ 24
తుపాను పేరు ఏదైతేనేం

తిరస్కార స్వరాలు 12



◆ స్ఫూర్తి

అమ్మాయిలు సాధించారు

ఏడు వందల మంది విద్యార్థినులు. ఎన్నో సార్లు అధికారులను అడిగిచూశారు. ప్రార్థించారు. వేడుకొన్నారు. ఉపయోగం లేకపోయింది. అయినా సరే పట్టు వీడలేదా అమ్మాయిలు. పిడికిళ్లు బిగించారు. అనుకున్నది సాధించి స్ఫూర్తిప్రదాతలయ్యారు.

నిన్నటి వరకు ఓ సాదా సీదా పల్లె ప్రాంతం 'భీమ్'! రాజస్థాన్‌లోని రాజ్‌సమంద్ జిల్లాలో వుంది. అజ్మీర్ నగరానికి వంద కిలోమీటర్ల దూరంలో వుంటుంది. 'గవర్నమెంట్ గరల్స్ హయ్యర్ సెకండరీ స్కూల్' ఎక్కడ వుంది? అని ఎవరినడిగినా చెప్పేస్తారిప్పుడు. అంతటి గుర్తింపు రావడానికి కారణం 700 మంది ఆడపిల్లలు చేసిన పోరాటమే. ఆ పోరాటం వెనక ఓ మంచి లక్ష్యం వుంది మరి. అందుకే అంత గుర్తింపు పొందింది.

ఈ ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 700 మంది విద్యార్థినులున్నారు. వీరంతా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారే. మరి టీచర్ల సంగతో! గత నాలుగేళ్లగా... ముచ్చటగా ముగ్గురు. అదీ ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీగానే వుంది. చరిత్ర, రాజనీతి శాస్త్రం చెప్పే వారే లేరు. ఉన్న ముగ్గురు ఉపాధ్యాయులు...అన్ని వందల మంది విద్యార్థుల్లో... ఎవరికని పాఠాలు చెప్తారు? పిల్లలు మాత్రం ఏం నేర్చుకుంటారు?

అందుకే పాఠశాల అధికారులను మొదలుకొని జిల్లా అధికారుల వరకు అందరికీ తమ గోడు వెళ్లబోసుకున్నారు. అదనంగా టీచర్లను ఇవ్వమని వేడుకొన్నారు. చెవిటివాని ముందు శంఖం ఊదిన చందమే అయ్యింది. గత నెల రెండవ తేదీన...దేశం యావత్తూ గాంధీ జయంతిని గొప్పగా చేసుకుంటున్న వేళ ... ఒక ఉద్యమం చేపట్టారీ ఆడపిల్లలు. తమ స్కూలుకు 300 అడుగుల దూరంలో వున్న జిల్లా అధికార కార్యాలయానికి వెళ్లి ... మరోసారి తమ డిమాండ్ వినిపించారు. అయితే అది నాలుగు గోడల మధ్య కాకుండా...నలుగురూ వినేలా చేశారు. వీధుల్లో ... జనం అంతా చూస్తుండగా...ఒక ప్రదర్శనగా వెళ్లారు. దాంతో అప్పటి వరకు ఏమాత్రం పట్టించుకోని అధికారులు మొదటిసారిగా గొంతు విప్పి ఈ నెల ఏడవ తేదీ లోపల మరో ముగ్గురు ఉపాధ్యాయులను పంపిస్తామని వాగ్దానం చేశారు.

అక్టోబర్ 8వ తేదీ వచ్చేసింది. కానీ కొత్త టీచర్లు మాత్రం రాలేదు. దాంతో విద్యార్థినులు నీరసపడిపోలేదు. మరో అడుగు ముందుకు వేసి... స్కూలు గేటుకు తాళం వేసేశారు. 700 మందీ పాఠశాల బయట వీధిలో నిలబడి... తమ డిమాండ్లతో ... ఆ బజారులోని తోపుడు బండ్ల వ్యాపారులతో సహా ప్రజలందరినీ ఆకట్టుకున్నారు. పోలీసులు, తహసీల్దారు, బ్లాక్ డివలప్‌మెంట్ ఆఫీసర్... ఎవరేం చెప్పినా ఆ చిన్నారుల పోరాటాన్ని ఆపలేకపోయాయి. కొత్తగా మరికొంతమంది టీచర్లు వస్తేనే తమ ఉద్యమాన్ని ఆపుతామన్నారు.

'మేం 700 మందిమి. మాకు ముగ్గురు టీచర్లా?', 'రఘుపతి రాఘవ రాజారాం... ఓ భగవంతుడా! మా ప్రభుత్వానికి బుద్ధినివ్వు' అన్న నినాదాలు బాగా ఆకట్టుకున్నాయి. ప్రజలను కూడా ఆలోచింపచేశాయి. మంచి కారణంతో ఉద్యమిస్తున్న వారికి తమ వంతు సాయంగా అందరూ ముందుకొచ్చారు.

విద్యార్థినులకు కావాల్సిన ఆహారం, మంచినీళ్లు ... అన్నీ చుట్టుపక్కల ఇళ్ల నుంచి, దుకాణాల నుంచి కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. పోరుబాట పట్టిన వారిలో 13 నుంచి 14 సంవత్సరాల లోపు చిన్నారులు చెప్పిన విషయాలు ... వాస్తవ స్థితి గతులను ప్రపంచానికి తెలియచేశాయి. 'మా నాన్న చనిపోయాడు. అమ్మ కూలి చేస్తుంది. నేను, మా చెల్లెలు స్కూలుకు రావడానికి రోజుకు 40 రూపాయలు ఖర్చు అవుతుంది. ఇది మా అమ్మ కూలిలో దాదాపుగా సగం వుంటుంది. అమ్మ మేం చదువుకుంటామని, బాగుపడతామని స్కూలుకి పంపుతుంది. అయితే ఇక్కడ టీచర్లు లేకపోవడం వల్ల అమ్మ కలలు కల్లలయ్యేలా వున్నాయి...' అని వాపోయింది హేమలత కుమారి అనే పన్నెండవ తరగతి విద్యార్థిని. పదవ తరగతి చదువుకునే పింకీ చెప్పిన మాటలు సమాజంలో ఆడపిల్లలు, మగపిల్లల మధ్య చదువు విషయంలో చూపిస్తున్న వివక్షను తెలియచేస్తుంది. "మాకు స్కూల్లో తాగడానికి మంచినీళ్లు లేవు. మరుగుదొడ్లు లేవు. అదే మగపిల్లల స్కూల్లో మరుగుదొడ్లు, మంచినీళ్లు వున్నాయి. చదువుకోవడానికి పుస్తకాలు సరఫరా చేస్తారు. సరిపడా టీచర్లు వున్నారు. ఇంత అసమానత ఎందుకు చూపిస్తున్నారు? మాకంటే వారెందులో గొప్ప? సరిపడినంత మంది టీచర్లు వుంటే మేం మగపిల్లల కంటే మంచి మార్కులు సాధించి చూపిస్తాం' అంది.

ఐకమత్యంతో చేసిన ఈ పోరాటానికి ప్రజల నుంచే కాదు. అధికారుల నుంచీ మంచి స్పందన వచ్చింది. మరునాడు స్కూలు తెరిచి, పాఠశాల ప్రారంభించే సమయానికి నల్గురు టీచర్లు గేటు ముందు నిలబడి వున్నారు. ఆడపిల్లలు విజయం సాధించి... దేశంలోని బడిపిల్లలందరికీ... మార్గదర్శకంగా నిలిచారివాళ.



ఉప్పు ముప్పు ఎంత?

మన గుండెకు రిపేర్లు తెచ్చేది లేదా ఆకస్మికంగా మూలన పడవేసేది ఉప్పు అనుకుంటున్నాం కదా? కానీ కొందరు అమెరికా పరిశోధకులు ఉప్పు మనకు శత్రువు కాదు, అసలు ముప్పు తెచ్చేది పంచదార అని ఢంకా బజాయిస్తూ జేమ్స్ ఓ కీఫీ, జేమ్స్ డినికొలాంటోనియో అనే కార్డియాలజిస్టులు తాజాగా అమెరికన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో కొన్ని వివరాలు తెలిపారు. మనలను రోగ గ్రస్తులను గావిస్తున్నదీ, అధిక బరువు, ఆందోళనకు గురి చేస్తున్నదీ పంచదారే అంటారు ఓ కీఫీ. పంచదార మనలో ఆకలిని పుట్టిస్తుంది దాంతో మనం మరిన్ని స్వీట్లు తింటాం, పంచదార

“ గతేడాది ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ అనే బ్రిటన్ సంస్థ ఎక్కువ ఉప్పు తీసుకోవటాన్ని నివారించాలని చెప్పింది. అయితే 1.5 నుంచి 2.3 గ్రాముల మధ్యరోజుకు తీసుకుంటే ఉపయోగాలు ఉంటాయని భవిష్యత్ పరిశోధనలు తేల్చవచ్చని ఒక ముక్తాయింపు. మొత్తం మీద ఇవన్నీ చదువుతుంటే కొందరు ఎక్కువ ఉప్పు తింటే ముప్పంటారు, మరికొందరు తక్కువ తిన్నా ముప్పే అంటున్నారు. ”

ఉన్న ఏ పదార్థాన్నీ తినకపోతే మన ఆరోగ్యాన్ని ఎంతో మెరుగు పరుచుకోవచ్చని నేను చెప్పగలను’ అన్నారాయన.

దీన్ని నమ్మాలా? అదే నిజమైతే మరి ఉప్పు ప్రధాన శత్రువుగా ఎలా ముందుకు వచ్చినట్లు? 2001లో జాతీయ ఆరోగ్య సంస్థ ఉప్పు గురించి ఒక అసమగ్ర అధ్యయనాన్ని ప్రచురించిందట. దాని ప్రకారం తక్కువ ఉప్పు తీసుకున్న వారిలో రక్తపోటు తక్కువగానూ ఎక్కువ తీసుకున్న వారిలో ఎక్కువగా ఉన్నట్లు తేలటంతో ఉప్పుతో వచ్చే ముప్పు గురించి అమెరికా ఆహార మార్గదర్శకాలు నిండిపోయాయి. అయితే మరికొన్ని పరిశోధనల్లో అది రుజువు కాలేదట.

కొందరు నిపుణులు మరొక అభిప్రాయాన్ని ముందుకు తెచ్చారు. అదేమంటే మన శరీరానికి ఉప్పు కావాలి. దాన్ని అందచేయకపోతే కిడ్నీ స్రవించే రెనిన్ అనే ఎంజైమ్ కారణంగా హైపర్‌టెన్షన్ వస్తుందట. ఉప్పు బాగా తక్కువ తీసుకున్న వారికి గుండె విఫలమయ్యే అవకాశాలు ఎక్కువని కూడా కొన్ని అధ్యయనాలు అభిప్రాయపడ్డాయి. మూడు సంవత్సరాల క్రితం సైంటిఫిక్ అమెరికన్ అనే పత్రిక ఉప్పును సమర్థిస్తూ కొందరు వృద్ధులు, ఆఫ్రికన్ అమెరికన్లకు తప్ప అమెరికాలో మిగతావారికి ఎలాంటి ముప్పులేదని రాసింది.

న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ అనే బ్రిటీష్ పత్రిక కూడా ఇదే సమయంలో ఉప్పు గురించి కొన్ని అభిప్రాయాలు వెల్లడించింది. పద్దెనిమిది దేశాలకు చెందిన లక్షమందికి పైగా పౌరులపై అధ్యయనం జరిగిందట. ఎక్కువ ఉప్పు తీసుకున్నవారిలో ఎక్కువ రక్తపోటు ఉందని తేలిందట. అదే పత్రికలో మరొక వ్యాసంలో రోజుకు ఏడు గ్రాముల కంటే ఎక్కువ తిన్నవారికి 3–6 గ్రాముల మధ్య తిన్నవారి కంటే వైకుంఠయాత్ర అవకాశాలు ఎక్కువ ఉంటాయని పేర్కొన్నారు. అమెరికన్లు సగటున రోజుకు ఒక మనిషి 3.4 గ్రాముల ఉప్పు తింటారట. అయితే అమెరికా ఆహార, ఔషధ యంత్రాంగం అంతకంటే తక్కువగా 2.3 గ్రాములు తీసుకోవాలని సిఫార్సు చేసింది. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ మాత్రం రెండు గ్రాములకు మించకూడదని చెప్పగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ 1.5 గ్రాములని సిఫార్సు చేసింది.

అయితే గతేడాది ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ అనే బ్రిటన్ సంస్థ ఎక్కువ ఉప్పు తీసుకోవటాన్ని నివారించాలని చెప్పింది. అయితే 1.5 నుంచి 2.3 గ్రాముల మధ్యరోజుకు తీసుకుంటే ఉపయోగాలు ఉంటాయని భవిష్యత్ పరిశోధనలు తేల్చవచ్చని ఒక ముక్తాయింపు. మొత్తం మీద ఇవన్నీ చదువుతుంటే కొందరు ఎక్కువ ఉప్పు తింటే ముప్పంటారు, మరికొందరు తక్కువ తిన్నా ముప్పే అంటున్నారు. (లీడ్ కాదు. బాక్సుగా వాడదాం)

ఉప్పు విషయమే కాదు, కొలస్టరాల్ విషయం కూడా ఇలాగే ఉంది. కొలస్టరాల్ మనకు మంచిది కాదు. దాంతో ఆ సమస్య ఉన్నవారు లేదా కొలస్టరాల్ పెరగకుండా ఉండాలంటే గుడ్డు తినటం పూర్తిగా మానుకోవాలని చెప్పారు. తెల్లభాగం తింటే కొంతమేరకు ఫరవాలేదన్నారు. తరువాత కొన్ని పరిశోధనల్లో గుండెజబ్బులకు గుడ్డు తినటానికి కొలస్టరాల్‌కు సంబంధం లేదని తేలిందన్నారు. అమెరికాలోని ఆఫ్రో అమెరికన్లలో 60 ఏళ్ల వారికి కొలస్టరాల్ 150 ఉంటే చికిత్స ప్రారంభించాలని గతంలో నిర్ణయించారు. అయితే రెండు సంవత్సరాల క్రితం 200–239 ఉంటే అది మధ్యస్థంగా ఉన్నట్లని చెప్పారు. అమెరికన్ల సగటు కొలస్టరాల్ 200 మాత్రమే.

ఇంతకీ ఎక్కువా వద్దు మరీ తక్కువా వద్దు అంటూ మనలను ముప్పు తిప్పలు పెడుతున్న ఉప్పును కనుగొని ఆరువేల సంవత్సరాలు అయిందని చరిత్ర చెబుతోంది. ఉప్పు కోసం యుద్ధాలు కూడా జరిగాయి. మనం తయారు చేసుకొనే ఉప్పును వినియోగిస్తే బ్రిటీష్ వాడికి లాభం ఎలా వస్తుంది? అందుకే తమ కంపెనీల నుంచి ఉప్పును దిగుమతి చేసుకొనే విధంగా మనం తయారు చేసుకొనే ఉప్పు మీద పన్ను వేశారు. మన స్వాతంత్ర్య ఉద్యమం దాన్ని కూడా ఉపయోగించుకొని బ్రిటీష్ వారిని ఉప్పుతో కొట్టేందుకు పూనుకొని ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చింది. అందుకే ఉప్పు మన శరీరాలకే కాదు, తనను సొమ్ము చేసకొనే వారికి కూడా ముప్పే అని ఉప్పు చరిత్ర నిరూపించింది.

- సత్య

ఇడ్లీ ఇలా కూడా...

కూరగాయల ఇడ్లీ

కావలిసినవి : ఇడ్లీ పిండి : నాలుగు కప్పులు, క్యారెట్లు : నాలుగు (ముక్కలు తరగాలి), బీన్స్: ఆరు, పచ్చి బఠాణీలు: పావుకప్పు, ఉల్లిపాయలు తరుగు : పావుకప్పు, పచ్చిమిర్చి : రెండు, మినప్పప్పు : అరచెంచా, ఆవాలు, జీలకర్ర, : పావుచెంచా చొప్పున, కరివేపాకు : కొద్దిగా, ఉప్పు : రుచికి తగినంత, నూనె: చెంచా.

తయారీ విధానం : క్యారెట్ ముక్కలు, బీన్స్, పచ్చిబఠాణీలు అన్నీ కలిపి ఉడికించుకోవాలి. తరువాత బాణలిలో నూనె వేసి ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి వేసి వేగాక ఉల్లిపాయ ముక్కలు చేర్చాలి. అవి మగ్గాక ఉడికించిన ముక్కలు, బఠాణీలు, ఉప్పు వేసి మూత పెట్టాలి. కొద్ది సేపయ్యాక దించేస్తే సరిపోతుంది. చల్లారాక ఇడ్లీ పిండిలో ఈ కూరను వేసి బాగా కలియతిప్పాలి. తరువాత ఇడ్లీ ప్లేట్లకు నూనె రాసి పిండిని వేసి ఆవిరిమీద ఉడికించాలి. ఇలా తయారైన వేడివేడి ఇడ్లీని కొబ్బరి చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.

స్పైసీ ఇడ్లీ

కావలసినవి : మినప్పప్పు ఒక కప్పు, సెనగపప్పు:ఒక కప్పు, కొబ్బరి కోరు: ఒక కప్పు, శొంఠి: కొద్దిగా, జీలకర్ర :1 టీ స్పూను, ఎండుమిరపకాయలు:పది, పచ్చిమిర్చి, ఉప్పు: తగినంత, చిన్నగా తరిగిన కొత్తిమీర తురుము.

తయారీ విధానం : రెండు పప్పు దినుసులనూ రెండు గంటలపాటు నీటిలో నానబెట్టాలి. తరువాత నీటిని ఒంపి దీన్ని పచ్చిమిరపకాయలు, శొంఠి, జీలకర్ర, ఎండిన మిర్చితోపాటు కొబ్బరితురుము కలిపి ఉప్పు తగినంత వేసి రుబ్బుకోవాలి. తర్వాత కొత్తిమీర తురుము పిండిలో కలిపి ఇడ్లీ పాత్రలకు నెయ్యి పూసి, ఆ తరువాత పిండి వేసి దీనిమీద కూడా కాస్తంత నెయ్యితో ఆవిరిమీద ఉడకబెట్టాలి. రుచికరమైన, మృదువైన ఇడ్లీలు తినడానికి సిద్ధం.

కాక్‌టైల్ ఇడ్లీ

కావలసినవి : ఇడ్లీలు : 6, టమాటాలు : 2, ఉల్లిపాయ: 1, నిమ్మకాయ: 1, ఉప్పు, ఎర్రకారం, నూనె: సరిపడినంత, కొత్తిమీర, పసుపు: కొద్దిగా.

తయారీవిధానం : ఇడ్లీలను కావలసిన సైజులో ముక్కలుగా కట్ చేయండి. ఉల్లిపాయ, టమాటాలు ముక్కలుగా కోయండి. మూకుడులో నూనె వేసి కాగిన తర్వాత టమాట, ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించండి. ఎర్రకారం, ఉప్పు, ఇడ్లీ ముక్కలు, చిటికెడు పసుపు వేసి బాగా కలపండి. మంట ఆర్పేసి నిమ్మరసం, కొత్తిమీర చల్లండి. అంతే కాక్‌టైల్ ఇడ్లీ రెడీ.

ఉలవ ఇడ్లీలు

కావలసినవి: ఉలవలు : 1కప్పు, ఉప్పుడు బియ్యం : 3 కప్పులు, ఉప్పు : రుచికి తగినంత.

తయారీ విధానం : ఉలవలను, బియ్యాన్ని విడివిడిగా 6 గంటలు నానబెట్టాలి. వడకట్టిన ఉలవల్ని ఐస్ వాటర్‌తో తడుపుతూ మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. బియ్యాన్ని కూడా మెత్తగా రుబ్బుకోవాలి. రెండిటినీ కలిపి ఒక రాత్రంతా ఉంచాలి. తర్వాత ఉప్పు కలిపి ఇడ్లీలు వేసుకోవాలి. న్యిం మనం తినే ఇడ్లీల కంటే బలమైన, రుచికరమైన ఆహారం ఇది. మీకిష్టమైన చట్నీ, సాంబారుతో తినేసేయండి.

సగ్గుబియ్యం ఇడ్లీ

కావలసినవి : సగ్గుబియ్యం : 1కప్పు, క్యారెట్ తరుము : పావుకప్పు, కొత్తిమీర : 1 కట్ట, ఇడ్లీపిండి (మినపప్పు, రవ్వ కలిపినది) : 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు : తగినంత, నూనె : అరటీ స్పూన్.

తయారీ విధానం : సగ్గుబియ్యాన్ని రెండు గంటలసేపు నీటిలో నానబెట్టి నీటిని వంపేయాలి. ఇడ్లీ పిండిలో ఉప్పు, నానబెట్టిన సగ్గుబియ్యం కలపాలి. ఇడ్లీ ప్లేట్లను తీసుకుని దానికి కొంచెం నూనె రాసి, దానిలో కొంచెం క్యారెట్ తురుము, సన్నగా తరిగిన కొత్తిమీర వేసి దాని పైన సగ్గుబియ్యం ఇడ్లీ పిండిని కలిపిన మిశ్రమాన్ని వేయాలి. వాటిని మామూలు ఇడ్లీ మాదిరిగా 5 నిముషాల నుంచి 8 నిముషాల సేపు ఆవిరిమీద ఉడికించాలి. వీటికి కొత్తిమీర చట్నీ మంచి కాంబినేషన్.

గోంగూర బేరం

◆ కథ

- హర్షిత

ఫోన్: 9908486615

'గోంగూరమ్మ, గోంగూరోయ్, గోంగూర' వీధిలో కేక వంట గదిలో ఉన్న కమలమ్మగారి చెవిలో పడింది.

టీ వడ పోస్తున్నదల్లా ....పనినలాగే వదిలేసి ...చేతులు కొంగుకు తుడుచుకుంటూ బయటికి వచ్చింది. వీధి చివరలో ఉన్న ఆ కేక తాలూకు మనిషి ఇంటి ముందుకు వచ్చేదాక ఆగి 'ఎంతకిస్తావ్?' అడిగింది.

'కట్ట ఆర్రూపాయలమ్మగారూ' బదులిచ్చింది.

'అబ్బా, గోంగూర కూడా మరీ ఇంత పిరెమా?'

'ముందు కూరాకు చూసి అనండమ్మా ఆ మాట! కట్ట పది రూపాయలైనా ఇంత తాజా కూర దొరుకుద్దా?'

'మారు బేరమా, మీ పొలంలోదా?'

'ఒక మడిచెక్కలో పెట్నాము తల్లీ! ఐనా తొందరగ జెప్పు, పొద్దెక్కుతోంది, తొరగా పోవాల, ఈ నాలుగు కట్టలయిపోతే మా తండకు బోత' హడావుడి ప్రదర్శించింది.

'మీ పొలంలో పండినదాన్ని కూడా ఇంతరేటు జెప్తవేమి? ఇచ్చేదుంటే చెప్పు'

'ఇయ్యానికి గాక బజార్లంట నేనెందుకు తిరుగుత. ఈ నాలుగు కట్టలకు ఇరవై రూపాయలియ్యి. అదీ చివరి బేరం గాబట్టి.'

'సర్లే, పోయిన వారం గాదు మా ఆయన మార్కెట్లో నాలుగు కట్టలు పది రూపాయలకు తెచ్చిందీ'

'అట్టయితే ఆడనే తెచ్చుకోరి, నాకు గిట్టుబాటు గాదు, ఇప్పందాక కట్ట అయిదుకు తక్కువకమ్మలే... ఇష్టం అయితే కొనండి లేకపోతే లేదు.'

కమలమ్మకి ఆకు కూర చూస్తే వదలబుద్ధి గావడం లేదు. కానీ చవకగా తీసుకుందాం అని ఆలోచన. 'చూస్తే అయిదుకు తక్కువకిచ్చేట్లు లేదు' మనసులో అనుకుంది. 'ఇంతకీ మీదే ఊరో?'

'మాదా అమ్మ, పక్కనే వెంకట్రాంపురం' తల వాళ్ల ఊరివైపు ఊపుతూ చెప్పింది.

'వెంకట్రాంపురమా, లచ్చువమ్మ తెలుసా? పండ్ల బుట్టేసుకొని వస్తది. మేం ఎప్పుడు పండ్లు ఆమె దగ్గర్నే కొంటం'

'ఆ.. ఆమె మా తోటి కోడలే.. పండ్లు మారుబేరం జేస్తది'.

ఇంట్లో నుండి 'కమలా? టీ ఇయ్యబ్బా.' భర్త కేక

'ఆ.. వచ్చే వచ్చే.. అమ్మీ, ఒక్క నిమిషం, ఆయనకు టీ ఇచ్చి వస్త'

'అమ్మో, నాకు ఇప్పటికే ఆలస్యం ఐందమ్మా, తొందరగా రారి'

తిరిగి వస్తూ 'ఆ.. చెప్పు, ఎంతంటివి? పది రూపాయలా..' కమలమ్మ తెలివి ప్రదర్శించింది.

> " ఆటోస్టాండు దగ్గిర ఛాయ్ తాగుదామనుకొన్న. ఎనిమిది రూపాయలు...బేరం పన్నెండు రూపాయలకిచ్చినా, ఛాయ్ డబ్బులతోటి ఇరవై రూపాయలు... మంచి బేరం... చిక్కటి ఛాయ్... "

'నేను పది రూపాయలెప్పుడన్న... లాష్టు మాట.. పదిహేను ఇయ్యి... మమ్మగాని బేరంగానీ, పొద్దుగాల్నే లేచొచ్చిన.. ఛాయన్న తాగలే..'

'అట్ల గాదుగాని, ఫైనల్... పన్నెండు ఇస్త.. ఇస్తే ఇయ్యి లేకపోతే లేదు'

'సరే అట్నే కానీ' గొణుగుతూ 'అదే చేత్తో కాస్త ఉడుకు నీళ్లు పోయరాదు' 'లౌక్యంగా' అంది కూరగాయలమ్మి.

'దానికేం భాగ్యం... ఆ కట్టలిలా ఇయ్యి..'

వంటగదిలోకి వెళ్లి రాతెండి గ్లాసులో టీ పోసుకొని వచ్చింది కమలమ్మ. కొంగుతో గ్లాసందుకొని ఊదుకుంటూ ఆ మాట, ఈ మాట జెప్తూ, టీ తాగింది. పైసలు తీసుకొని ఆటోస్టాండ్ వైపు దారి బట్టింది కూరగాయలమ్మి.

❀❀❀

కమలమ్మ వంట గదిలోకి పోతూ అనుకొంది 'వారం కిందట ఈయన్ని లేత గోంగూర తెమ్మంటే కట్ట అయిదు రూపాయల చొప్పున తెచ్చిండు పైగా ముదిరింది కూడాను. ఈరోజు అతి చవకగా సగం ధరకే తీసుకొన్నా'నని తన తెలివికి తన భుజం తనే తట్టుకొంది.

❀❀❀

బాటపట్టిన కూరగాయలమ్మి 'ఆటోస్టాండు దగ్గిర ఛాయ్ తాగుదామనుకొన్న. ఎనిమిది రూపాయలు...బేరం పన్నెండు రూపాయలకిచ్చినా, ఛాయ్ డబ్బులతోటి ఇరవై రూపాయలు... మంచి బేరం... చిక్కటి ఛాయ్...' తనలో తనే నవ్వుకుంటూ, నాలుక చప్పరించుకుంటూ గబగబా నడక సాగించింది...

నవ్వుల్ – పువ్వుల్

జన్మజన్మలకీ!

అప్పు తీసుకునేవాడు : ఎన్ని జన్మలెత్తినా, మీ రుణం తీర్చుకోలేను..!

అప్పు ఇచ్చేవాడు : అంటే, అన్ని జన్మలలోనూ నా దగ్గర అప్పు పెట్టేస్తావా...?

హీరోయిన్



కూతురు : అమ్మా, నేను హీరోయిన్‌ని అవుతానే..!

తల్లి : ఏమ్మా... ఎందుకు..?

కూతురు : మరి కుట్టించుకున్న బట్టలన్నీ కురచైపోతున్నాయిగా, హీరోయిన్ అయితే అవి పని చేస్తాయని...!

కనబడరేం?



సుధాకర్ : నీ అంత సన్నాసిని నేనెక్కడా చూడలేదు...!

రవి : నేను చూశాను..!

సుధాకర్ : ఎక్కడా...?

రవి : ఆ అద్దంలో...

సుధాకర్ : ఎవరూ, కనబడరే...?

రవి : నీవు అద్దం ఎదురుగా నిలబడు, అప్పుడు కనిపిస్తాడు..!

దొంగిలించావ్?

పోలీస్ : ఏయ్ మిస్టర్, నీవు దొంగతనం చేయడం నేను చూశాను..!

దొంగ : ఎవరికీ చెప్పమాకు, ఇంద ఇది తీసుకో...!

పోలీస్ : మర్యాదగా నీవు దొంగిలించనవన్నీ అక్కడ పెట్టేయ్.. నేను దొంగతనం చేయాలి...!

పీకు



అప్పు : నాకు పంటిపోటు ఎక్కువగా వస్తుంది...!

సుబ్బు : అయితే పన్ను పీకించేయ్...!

అప్పు: నీకెప్పుడైనా తలపోటు వచ్చిందా ...?

సుబ్బు : ఆ వచ్చింది...!

అప్పు: మరి నీ తల పీకించేయ్‌లేకపోయావా..!

మిగిలింది

సోమేశం : ఏవయ్యా, ఎక్కడికి వెళు తున్నావు...?

పరమేశం: సంతకి...!

సోమేశం : ఏం కొట్టుకొచ్చేయడానికేమిటి...?

పరమేశం: నీవు కొట్టుకొచ్చేయగా మిగిలినవి...!

ఛీ.. చీమలా?



దొంగ : హేండ్సప్, చేతులు పైకెత్తి నీ వంటి మీదున్నవి నాకిచ్చేయ్!

సుబ్బారావు: నా వంటి మీద రెండు చీమలు పాకుతున్నయ్. అవి తీసేసుకో..!

అదే కూర...



సోమయ్య: ఏరా చరణ్, ఎప్పుడూ నీరసంగా వుంటున్నావ్.. కాళ్లేమో ములక్కాడల్లా వున్నాయి...!

చరణ్ : మా అమ్మ ఎప్పుడూ ములక్కాడ కూరే వేసి పెడుతుంది మరి.

ఇప్పుడా?

షాపు యజమాని : సార్ మా షాపులో దొంగతనం జరిగింది.

పోలీస్ : ఎప్పుడు జరిగింది..?

షాపు యజమాని : సుమారు ఐదు సంవత్సరాల క్రితం..!

పోలీస్ : మరిప్పుడు కంప్లయింట్ ఇస్తున్నారేం...?

షాపు యజమాని : దొంగతనం జరిగిందన్న విషయం ఇప్పుడే కనిపెట్టాను కాబట్టి...!

పిల్లనా?



వెంకటేశ్వరరావు : మావాడికి పెళ్లి చేద్దామనుకుంటున్నానోయ్... మంచి పిల్లని చూడు..!

పెళ్లిళ్ల బ్రోకర్ : ఏం పిల్లని.. కుక్కపిల్లనా, పిల్లి పిల్లనా...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

మానవా! మారవా?!

రాకెట్లను ప్రయోగిస్తున్నాం. ఆకాశహర్మ్యాలను నిర్మించుకుంటున్నాం. కార్లలో, విమానాల్లో ప్రయాణిస్తున్నాం. చిన్నారులకు మంచి మంచి స్కూళ్లలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం. అయితే... పౌర వర్తన విషయంలో మాత్రం వేలెత్తి చూపించుకునేలా వున్నాం. మనం నివసిస్తున్న వీధులు, పని చేస్తున్న కార్యాలయాలు, ఉపయోగిస్తున్న రోడ్లు, బస్సులు, వాటికి పెట్టుకున్న నిబంధనలు, చేస్తున్న ఉల్లంఘనలు, నిర్లక్ష్యాలు... అదే చెప్తున్నాయి. ఈ విషయంలో మాత్రం అందరూ సమానులే. జాతి, మత, వర్గ, వర్ణ, పేద, ధనిక...అన్న బేధాలేం లేవు.

- కె. సాహిల్

'బస్'... ప్లీజ్!

బస్సు ఎక్కడమంటే మాటలా! మరీ ముఖ్యంగా ఆఫీసు, స్కూళ్ల వేళల్లో. ఫుట్‌పాత్ మీద ఫెవిక్విక్‌తో అతికించినట్టు గుంపులు గుంపులుగా వేళ్లాడుతుంటారు. ఆ గుంపును ఛేదించుకుని లోపలికి వెళ్లడమంటే మాటలు కాదు! ఎంత చెమటోడ్చాలి? ఎంతమందితో కాళ్లు తొక్కించుకోవాలి? ఎన్ని ముష్టి ఘాతాలకు బలికావాలి? 'సాహసం సేయరా డింభకా. గమ్యస్థానం చేరేందుకు సీటు లభిస్తుంది' అనుకుంటే తప్ప మనకా ధైర్యం, శక్తి రావు. నిజానికి ఫుట్‌పాత్ మీద అంతమంది అలా వేళ్లాడాల్సిన అవసరం అన్ని వేళలా వుంటుందా? అంటే ఉండకపోవచ్చు. కానీ కుర్రాళ్లకు అలా అలవాటైపోయింది. 'ఏముంది మూడో స్టాపే కదా.. రెండో స్టాపే కదా' అనుకుంటూ కడ్డీలు పట్టుకుని వేళ్లాడుతూ ఉంటారు. ఇంటర్వ్యూలకు వెళ్లేవాళ్లెవరైనా బస్సెక్కారో... అంతే సంగతులు! చెప్పు తెగిపోయి, బెల్టు ఊడిపోయి, ఇస్త్రీ మడతలు మాయమైపోయి.. జుట్టు రేగిపోయి సినిమా హాళ్లలో బ్లాకు టికెట్లు అమ్ముకునేవాడి మాదిరిగా మారిపోయినా ఆశ్చర్యం లేదు.

ఎలాగో తిప్పలు పడి బస్సు లోపలికి చేరుకుంటే... అక్కడ మరో

సమస్య. సీట్లలో కూర్చున్న వారు ఏమాత్రం తగలకూడదంటారు. ముట్టుకోకూడదంటారు. ఆ గుంపులో మునివేళ్లమీద నిలబడి సర్కస్ ఫీట్లు చేస్తున్నా... చేతిలో వున్న సంచో, పుస్తకమో, బ్యాగ్గో ఇస్తామన్నా... పుచ్చుకోరు. ప్రపంచ భారమంతా వారే మోయాల్సి వచ్చినట్టు ఫీలైపోతారు.

సీటు సిత్రాలు

బస్సులో సీటు సంపాదించడానికి ఎన్నేసి మార్గాలు కనిపెట్టారో మనోళ్లు! బస్సు ఆగీఆగకముందే కిటికీల్లోంచి రుమాళ్లు, తువాళ్లు, దిన,వార, మాస పత్రికలు వేసేస్తుంటారు. కిటికీల్లోంచి దూరిమరీ సీట్లలో చతికిలపడుతుంటారు మరికొందరు. ఇక ముందు నుంచి బస్సెక్కడానికి జరిగే ముష్టి యుద్ధాల సంగతి సరేసరి. లోపలికి వచ్చాక రుమాలుతో సీటు ఆపినవాడికి ముష్టియుద్ధంలో విజయం సాధించి వచ్చి ఆ స్థానాన్ని ఆక్రమించుకున్న వాడికి లడాయి మొదలౌతుంది. 'నేను ముందే సీటు ఆపానంటాడు' ఒకడు. 'మనిషి వచ్చి కూర్చుంటేనే గతి లేదు కానీ ... చీమిడి తుడిచిన గుడ్డముక్క వేశాడట... సీటు ఆపాడట' అంటూ వెటకారంగా నవ్వుతాడు మరొకడు. అక్కడ అలా మొదలైన వాగ్వాదంలో మాట పెరగడం... తూలడం.. ఆవేశకావేశాలు ... మామూలే.

కుర్రాళ్లంటే ఎలాగోలా ఎక్కేస్తారు. దిగేస్తారు. ఆడవాళ్లు... వృద్ధుల సంగతేంటి? 'మహిళలను గౌరవిద్దాం. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం' వంటివన్నీ రాతలకే పరిమితం అవుతుంటాయి. వారి సీట్లలో పురుషపుంగవులు ఎంచక్కా అలా సెట్టయిపోతారు. ఓకే ఎవరూ రాకముందర కూర్చున్నారు. వచ్చాక లేచి సీటు ఇద్దామన్న ఇంగితజ్ఞానమే వుండదు. పైగా వారు ఎక్కడ అడుగుతారో... ఎక్కడ లేవాల్సి వస్తుందోనని కిటికీల్లోంచి శూన్యంలోకి చూసేవారు.. పుస్తకాలు, పత్రికల్లో మునిగిపోయినట్టు నటించేవారు.. ఎన్ని వేషాలని! మహిళలు కూడా... 'ఆ! పది నిముషాలేగా.. నిలబడదాం.. వీళ్లతో ఎందుకు?' అనుకుని నిలబడిపోతుంటారు మొహమాటంగా. నోట్లో నాలుక వున్న వాళ్లు మాత్రమే లేపి కూర్చోగలరు. దగ్గరోదాపో అయితే ఏదో సర్దుకుపోవచ్చు. కానీ దూరపు ప్రయాణాల్లో సీటు కోసం నోరు తెరిచి అడగక తప్పదు.

నిబంధనలా... అవెట్లుంటాయ్!

కుర్రకారు ద్విచక్ర వాహనాలను నేలమీద నడపరు. మేఘాలలో తేలిపోతుంటారు. ఇక ఇహలోక నిబంధనలేం గుర్తొస్తాయి? పచ్చలైటు పడినప్పుడు మాత్రమే ముందుకెళ్లాలని, ఎర్ర లైటు పడినప్పుడు ఆగాలని అనుకోరు. అలా తన లోకంలో తాను విహరిస్తూ... అలా రాష్‌గా వెళ్లిపోతారు. వింత హారన్ల నేపథ్య సంగీతాన్ని మర్చిపోకూడదు. ఇలా ఒక్కరు చేసిన ఘనకార్యానికి ట్రాఫిక్ జామ్‌లు, ఆలస్యాలు, అనుకోని దుర్ఘటనలు.. ప్రాప్తిస్తుంటాయి. కార్యాలయాలు, పాఠశాలలకు చేరుకునే సమయాల్లో ... సాయంత్రం విడిచే వేళల్లో... ఇలాంటివి జరిగితే ఎదురయ్యే ఇబ్బందుల గురించి చెప్పలేం. ప్రపంచం అంతా ఒక్కసారి ఆగిపోయినట్టే అనిపిస్తుంది. ఇప్పుడంటే సోల్లేసుకోవడానికి సెల్‌ఫోన్లు వచ్చాయిగానీ... లేకపోతే అంతసేపు నడిరోడ్డుమీద నిలబడడమంటే మాటలా చెప్పండి. ఇక రోడ్ డివైడర్లను సైతం లెక్కచేయకుండా దాటించేసేవారు తరచూ తారసపడుతుంటారు. చూసి ఊరుకోలేక అడిగితే... 'పెద్ద చెప్పొచ్చాడండీ.. ఎప్పుడూ డివైడరే దాటనట్టు...?' అనేస్తారు. దాంతో అవతలి వారి నోరు మూతపడిపోతుంది. మరి అందరూ అన్ని సమయాల్లో ఉత్తములు కారుకదా. ఎప్పుడో డివైడర్ దాటిన దృశ్యం గుర్తొచ్చి అలా కామైపోతారు. అందరూ అన్ని సమయాల్లో నిబంధనలను పాటిస్తే... ఎవరికీ ఏ తిప్పలూ వుండవు.

'చెత్త' చర్చ

పచ్చదనం, పరిశుభ్రత అనేవి ఏ ఒక్కరితోనే సాధ్యం కాదు. అందరూ అన్నివేళలా అమలుపరిస్తేనే అవుతుంది. ఇంటిని అద్దంలా మెరిపించేవారు సైతం తమ ఇంట్లో చెత్తని తీసుకొచ్చి వీధుల్లో ఎక్కడపడితే అక్కడ పారేస్తుంటారు. ఒకవేళ మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన చెత్తకుండీలు వున్నా... వాటిలో కాకుండా ... జాగ్రత్తగా ... ఆ పక్కనే పడేస్తుంటారు. ఇక కుక్కలు, పందులకైతే అవి స్వర్గధామాలే. గాలికి, వానకు చెత్తంతా కుండీల నుంచి రోడ్ల మీదకు వచ్చిపడుతుంది. 'చెత్త వేయు వాడు గాడిద...' అని గోడల మీద రాసినా ...

లెక్కేలేదు. 'ఇంకా డౌటా?!' అన్నట్టు వేసేస్తుంటారు. ఇక రోడ్ల మీద వెళ్తూ తినేవాళ్లు, తాగేవాళ్లు, వేసే తొక్కలు, కవర్లు, గుట్కా ప్యాకెట్లు, బాటిళ్ల... సంగతి చెప్పాల్సిన పనే లేదు. తినడం, తాగడం ఎక్కడ అయిపోతే అక్కడే పడిపోతాయి తొక్కలు, సీసాలు. రోడ్లా, పార్కులా, గుళ్లా, స్కూళ్లా, ఆటస్థలాలా... అనేదానితో సంబంధమే లేదువారికి ఆ ప్రదేశాలన్నీ సమానమే. కార్యాలయాల్లోనో, విద్యాసంస్థల్లోనో సందర్భం వచ్చినప్పుడు స్వీట్ పాకెట్లు ఇచ్చినా అదే దృశ్యం. చక్కగా తినేసి... కవర్లు వుండచుట్టి... కుర్చీల కిందో, గోడ మూలనో పడేసి వెళ్లిపోతారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ చెత్తబుట్టను వాడాలనే అనుకోరు. అన్నిటినీ మించి చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకూడదని, చెత్తబుట్టలను వాడాలని అస్సలు అనుకోరు.

ఉమ్మి తొట్టి వాడేదెవరు?

పాన్ నమిలేవాళ్లు, సిగరెట్ తాగేవాళ్లు, వక్క పొడి నమిలేవాళ్లు... కామన్‌గా చేసే పని ఒక్కటే. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మడం. ఎవరు ఎక్కడ ఉమ్మినా... కింద పడక తప్పదు. మరి భూమ్యాకర్షణ శక్తి వుంటుంది కదా. కార్లలోంచి వెళ్లే వారు ఆపిమరీ కిటికీలోంచి బయటికి ఉమ్మేస్తుంటారు. నోరు పుక్కిలించి ఊసేస్తుంటారు. ఇక పాన్ అయితే చెప్పనలవి కాదు. ఎవరో రక్తం కక్కుకున్నట్టు పచ్రుమని రోడ్డుమీదే ఉమ్మేస్తారు. ఎక్కడైతే 'ఉమ్మ వద్దు' అని రాసి వుంటుందో సరిగ్గా అక్కడే ఉమ్మేస్తుంటారు. ఇక బబుల్‌గమ్ నమిలేవాళ్లతో మరో సమస్య. బాగా నమిలి బుడగలు చేయడం వరకు బానే వుంటుంది. ఆ తర్వాతే... దాన్ని ఎక్కడ వేయాలనేదానికి వీరి దగ్గర వెయ్యి దారులున్నాయనుకోండి. ఆఫీసుల్లో అయితే కుర్చీలు, బల్లల కింద, కంప్యూటర్ టేబుల్ కింద, మెట్లకు, గోడలకు, తలుపులకు ... అలా తెలివిగా అంటించేస్తారు. పొరపాటున మరెవరైనా కుర్చీనో, బల్లనో లాగబోయి దాని మీద చెయ్యి వేస్తే... ఎంత చిరాకొస్తుందో మాటల్లో చెప్పలేం. ఆఫీసుల్లోనైనా మరెక్కడైనా డస్ట్‌బిన్లు వున్నా అక్కడిదాకా వెళ్లాలంటే బద్ధకం అంతే. పాన్ నమిలే అలవాటున్న వారి సంగతి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వీరి అరాచక కృత్యాలనుంచి జనానికి విముక్తి కలిగించడానికి ... పెద్ద పెద్ద ఉమ్మి తొట్టెలు, ఇసుక బకెట్లు ఏర్పాటు చేస్తున్నా... రెండు గోడల మూల కనిపిస్తే చాలు.. తుపుక్కున ఊసేస్తారు. గోడల మీద మరకలు వేయడంలో కలిగే ఆనందం వీరికి మరెందులోనూ వుండదేమో!

ఎక్కడ పడితే అక్కడేనా!

చిన్నతనంలో ఒకటికి రెంటికి వెళ్లడానికి శిక్షణ ఇస్తుంటారుపెద్దలు. కానీ బహిరంగ ప్రదేశాల్లో ఇందుకోసం ఎలాంటి శిక్షణ వుండడంలేదు. ఎక్కడ వస్తే అక్కడ...ఎక్కడ గోడ కనిపిస్తే అక్కడ అన్నట్టుంది సుస్సు సీన్. '....పోసిన వారికి చెప్పుదెబ్బలు' అని వున్నా లెక్క చేయం. పబ్లిక్ టాయిలెట్లను ఎందుకు ఉపయోగించరో అస్సలు అర్థం కాదు. ఒక వేళ రెంటికి ... ఒకటికి వెళ్లినా నీళ్లు పోయకుండా వచ్చేసేవారికి కొదవేం లేదు. దీనికి సిగరెట్ కాల్చే అలవాటు కూడా తోడైతే ... ఆ తర్వాత వచ్చినవారికి ... ఊపిరాడక... వాంతి రావడమో, వారం పాటు అన్నం సయించకపోవడమో జరిగినా ఆశ్చర్యం లేదు. ఓ వైపు జనం నడుస్తూనే వుంటారు. మరోవైపు ఏదో పనున్నట్టు బైకులు ఆపి మరీ గోడల్లా నిలబడి పనికానిచ్చేస్తుంటారు. ఆ పక్కగానే మహిళలు నడుస్తుంటారన్న స్పృహే వుండదు. పనైతే చాలన్నట్టు వ్యవహరిస్తుంటారు. ఒక వేళ తాత్కాలికంగా అక్కడెవరూ ఆ పనిలో లేకున్నా... ఆ 'సుగంధాలు ముక్కుపుటాలను అదరగొడుతూనే వుంటాయి. అందుకే వాటిని వాడలేక ... బయట పోలేక... ఇంటికి వెళ్లే వరకూ ఉగ్గబట్టుకుని రోగాలు తెచ్చుకుంట్నున్న వారూ వున్నారనుకోండి.

'బ్రేక్' మాస్టర్లు

ప్రతి ఒక్క ప్రదేశంలోనూ కొన్ని రూల్స్ వుంటాయి. ఆసుపత్రుల్లో 'సిగరెట్ కాల్చకూడదు' అని రాసి వుంటుంది. కానీ కాల్చేస్తాం. తోటల్లో 'పూలు కోయకూడదు' అని వుంటుంది. దొంగ చాటుగా తెంపేస్తాం. కొందరైతే ... మరో అడుగు ముందుకేసి కొమ్మలు కూడా తీసుకెళ్తుంటారు. గృహ ఉద్యానవనాన్ని వృద్ధి చేయడానికే లెండి!

అంబులెన్సయినా ఆగేదే లేదు

అంబులెన్సంటేనే అత్యవసర సేవలు అందించే వాహనం. అలాంటి వాటికి కూడా మనం దారి ఇచ్చేదే లేదు. 'కుయ్యో...కుయ్యో...' అంటూ అది ఎంత గీ పెడుతున్నా... మన చెవికి మాత్రం సోకదు. ఒక్క క్షణం ఆగి దానికి దారి ఇద్దామని కూడా అనుకోం. అంబులెన్స్‌లో పిల్లలే వుంటారో, పెద్దలే వుంటారో, గర్భిణులే వుంటారో, గుండెపోటు వచ్చిన వారే వుంటారో ... మనకు తెలియదు. తెలియకపోయినా అంబులెన్సుకు దారి ఇచ్చి మానవతను ప్రదర్శిద్దామని మాత్రం అనుకోం. అది కూడా అలా మనతో పాటే ట్రాఫిక్‌లో ఆగి ఆగి ఆసుపత్రులను చేరాల్సిందే. ఆ వాహనంలో మనకు కావాల్సిన వారెవరైనా వుంటే...అన్న చిన్న ఆలోచన చేస్తే... మనం ఇంత రాతి హృదయులుగా ప్రవర్తించమేమో!

ఢీకొట్టి పరిగెత్తటమేనా?

పొరపాట్లు అందరూ చేస్తారు. ఇందుకు ఎవరూ మినహాయింపు కాదు. అయితే మన వల్ల ఎవరికైనా ఇబ్బంది, అసౌకర్యం కలిగితే వారికి తప్పక క్షమాపణలు చెప్పాలి. ఇది మన బాధ్యత కూడా. కానీ అలా ఎందరు చేస్తున్నారు? పాదచారులను గుద్దినా సరే... వారి మానాన వారిని విడిచిపెట్టేసి అలా దూసుకెళ్లిపోతారంతే. ఒకవేళ అత్యవసర వైద్య సహాయమే వారికి చేయించాల్సి వస్తే... ? ఎవరు బాధ్యులు? ఆ అవసరమే లేకపోయినా... కనీసం ఆగి పరామర్శించి సారీ చెప్పడం మన సంస్కారం. ఆ సంస్కారాన్ని ప్రతి ఒక్కరూ ఒంటబట్టించుకోవాలి. లేకుంటే అడవిలో జంతువులకూ మనకూ పెద్దగా తేడానేం వుండదు. కాకపోతే మనం బట్టలు వేసుకుని వాహనాల మీద తిరుగుతంటాం అంతే. అదే తేడా.

గ్రంథాలయ్యాల్లో 'మాట్లాడకూడదు. సైలెన్స్ ప్లీజ్' అని రాసి వున్నా...కబుర్లు, చర్చోపచర్చలు చేస్తుంటారు. 'గ్రంథాలయంలో పేపర్లు చించకూడదు' అని వున్నా లెక్క చేయం. అటూ ఇటూ చూసేసి... పరపరా చించేసుకు పోయే వారూ వున్నారు. చారిత్రిక కట్టడాల సంగతే చూద్దాం. 'గోడల మీద రాయకూడదు' అని వుంటుంది. అత్యుత్సాహంతో అక్కడే రాసేవాళ్లు... ప్రేమ పేర్లను చెక్కేవాళ్లు... ప్రేమ చిహ్నాలు గీసేవాళ్లు...తమ 'అందమైన' రాతల పక్కన నిలబడి ఫొటోలు దిగేవారు... కోకొల్లలు. వీటిమీద పత్రికల్లో ఎంత చర్చ జరిగినా...ఎన్ని వ్యాసాలు, కథనాలు వచ్చినా, అధికారులు ఎంతగా మొత్తుకున్నా... మార్పే వుండదు. తమ పేర్లు ఆయా పురాతన కట్టడాల మీద వుండిపోవాలన్న వెర్రి తప్ప వారిలో మరే ఇతర ఆలోచనలు వారిలో కనిపించవు. నీళ్ల వృధా చేయొద్దంటే వినం. పబ్లిక్ కుళాయిలు అలా జీవనదుల్లా పారుతున్నా... వంగి కట్టేయాలనుకోం. నిబంధనలను 'బ్రేక్' చేయడంలో రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తుంటాం.

చికాకులు చిన్నవే!

ఎవరిదో ఎక్కడో పెళ్లి! కానీ వీధి మొత్తానికి తెలియాలి. బాజాబజంత్రీలు, పాటలు, మంత్రాలు ... అన్నీ బహిరంగమే. ఇక పండగలు, పబ్బాలప్పుడు మైకులను విపరీతంగా వాడేస్తుంటారు. ఆ సమయంలో ఇరుగు పొరుగుకు ఆరోగ్యమే బావుండకపోవచ్చు. పిల్లల పరీక్షలే వుండొచ్చు. అర్ధరాత్రి వరకూ చెవులు పగలకొట్టడం, ఇతరుల ప్రశాంతతను దోచుకోవడం న్యాయమా? కొందరికైతే మైకుతో పని లేదు. గొంతే పెద్ద మైకులా వుంటుంది. బస్సా, ఇల్లా, రైలా, సినిమా హాలా, ఆస్పత్రా, ఆఫీసా? అన్న ఆలోచనే వుండదు. పూర్తి స్వేచ్ఛాస్వతంత్రాలతో పే...ద్ద...గా మాట్లాడేస్తుంటారు. వారిని...వారి సంభాషణను విస్మరించి... ఆ పరిసరాల్లో వున్న వారెవరైనా సరే ... శ్రద్ధగా పని చేసుకోగలిగితే ఒట్టు. అదే విషయాన్ని చుట్టు పక్కల వారికి ఇబ్బంది లేకుండా తక్కువ స్వరంతో చెప్పినా అవతలి వారికి అర్థమౌతుంది కదా!. ఇక పెంపుడు జంతువుల సంగతి. వాటిని రెంటికి తీసుకెళ్తుంటారు. అవి నడిచినంత దూరం నడిచి... ఇతరుల వాకిళ్ల ముందే కానిచ్చేస్తుంటాయి. ఇక ఆ కంపు భరించ తరమా? కొన్ని దేశాల్లో అయితే పెంపుడు కుక్కలు రెంటికి వెళ్లినా దాన్ని శుభ్రం చేయాల్సిన బాధ్యత సదరు యజమాని మీదే వుంటుంది. ఇలాంటివి మన వాళ్లు ఎప్పుడు నేర్చుకుంటారో ఏమో? ఎవరి చేతిలోనైనా మంచి పుస్తకం కనిపిస్తే .. రెండ్రోజుల్లో చదివిస్తామని అడిగి మరీ తీసుకుంటారు. వారాలు, నెలలు, సంవత్సరాలు అలా గిర్రున తిరుగుతుంటాయి కానీ... పుస్తకం మాత్రం సొంతదారుని చేరదు. అడిగీ అడిగీ నోరు నొప్పి మాత్రం మిగులుతుంది. ఇక రోడ్డు మీద పాదచారులను ఏడిపించే వాహనదారులకు కొదవు లేదు. వేగంగా వెళ్తూ... సరిగ్గా మనిషి దగ్గరకు రాగానే పెద్దగా అరవడం, అకస్మాత్తుగా హారన్ మోగించడం... అలాంటి వెర్రి వేషాల్లో కొన్ని మాత్రమే.

ఇన్ని విషయాలను ఇంత సేపు చెప్పుకున్నాక ఒక్క విషయాన్ని విస్మరిస్తే ఎలా! అదే పరివర్తన గురించి. మనం పెట్టుకున్న రోడ్డు నిబంధనలను, ఏర్పాటు చేసుకున్న పరిశుభ్రతా సూత్రాలను మనమే అతిక్రమిస్తే ఎలా? రూల్స్ వున్నది బ్రేక్ చేయడానికి కాదు. రికార్డులు సృష్టించడానికి. 'ఫలానా ప్రాంత పౌరులు అత్యంత క్రమశిక్షణతో మెలుగుతారు. ట్రాఫిక్ ఇబ్బందులే వుండవు. బహిరంగ ప్రదేశాలు చాలా పరిశుభ్రంగా వుంటాయి' అని పది మందీ చెప్పుకునేలా మనలో మార్పు వస్తే ఎంత బావుంటుంది. అడపా దడపా ఆదర్శ గ్రామాల గురించి, అక్కడి పరిశుభ్రత గురించి ... పత్రికల్లో వచ్చిన కథనాలను చదివి ముచ్చటపడుతుంటాం. అది ఏ ఒక్కరో సాధించిన విజయం కాదు. గ్రామస్తులందరి చెయ్యి వుందని మర్చిపోకూడదు. 'రాక్ అలా కాదు బురదలో సుగంధాన్ని వెతుక్కునే వరాహాల్లా...నిబంధనల ఉల్లంఘనల్లోనే ఆనందాన్ని వెతుక్కుంటాం" అంటే చేసేదేం లేదు.

తిరస్కార స్వరాలు

ఓ నోబుల్.. ఒక ఆస్కార్... ఓ గ్రామీ.. ఒక సాహిత్య అకాడమీ... అవార్డును అందుకోవాలనుకోని వారుంటారా! అనడిగితే... ఖచ్చితంగా 'వుంటారు' అని సమాధానం చెప్పకోవాల్సి వుంటుంది. సరిగ్గా యాభై ఏళ్ల కిందట అక్టోబర్ 22వ తేదీన జరిగిందా ఘటన. ప్రసిద్ధ ఫ్రెంచి తత్వవేత్త, రచయిత జీన్ పాల్ సాత్రే నోటి వెంట వచ్చిన ఆ మాటలు... ప్రపంచాన్నే నివ్వెర పరిచాయి. సాహిత్య రంగంలో తన పాదాల చెంతకు వచ్చిన నోబెల్ పురస్కారాన్ని తిరస్కరించాడు. అందుకు ఎన్నో కారణాలు. 'అధికారిక' అవార్డులను ఆయన ఎన్నడూ ఆహ్వానించకపోవడం అందులో ఒకానొక కారణం. ఇలాంటి సందర్భాలు ఆ తర్వాత అనేకమంది విషయంలో పునరావృతమయ్యాయి. అందుకు రాజకీయ కారణాలు కీలక పాత్ర పోషించాయి. అలాంవాటిలో పది ఘటనలు...

మార్లాన్ బ్రాండో

అకాడెమీ అవార్డు (1973)

'ది గాడ్‌ఫాదర్' చిత్రంలో మార్లాన్ బ్రాండో ప్రదర్శించిన నటనకు గాను... ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డు ప్రకటించింది జ్యూరీ. అయితే ఆయనకు బదులుగా ఆస్కార్ ఉత్సవానికి హాజరైన అమెరికన్ నటి సచీన్ లిటిల్ ఫెదర్ ... వేదిక మీదకొచ్చి చెప్పిన మాటలు సభికులనేకాక... టీవీలలో అకాడెమీ ఉత్సవాన్ని వీక్షిస్తున్న వారిని కూడా ఆశ్చర్యపరిచాయి. చిత్ర పరిశ్రమలో స్థానిక అమెరికన్లను కించపరుస్తున్న వైనానికి నిరసనగా బ్రాండో ఆ అవార్డును తిరస్కరిస్తున్నట్టు ఆమె తెలియచేసింది.

గ్రెగోరి పెరెల్‌మేన్

ఫీల్డ్స్ మెడల్ (2006), మిలీనియమ్ ప్రైజ్ (2010)

గ్రెగోరి పెరెల్‌మేన్ గొప్ప రష్యన్ గణిత శాస్త్రజ్ఞుడు. గణితంలో నోబెల్ బహుమతిగా భావించే 'ఫీల్డ్స్ మెడల్'ను 2006లో తిరస్కరించాడు. పైగా క్లే మేథమేటిక్స్ ఇనిస్టిట్యూట్' ఇచ్చే 'మిలీనియమ్ ప్రైజ్'నూ కాలదన్నాడు. అందుకా గణిత మేధావి చెప్పిన సమాధానమేమంటే...'నాకు పేరు ప్రఖ్యాతుల మీద ఆసక్తి లేదు' అని. అంతేకాదు! జూలో జంతువు మాదిరిగా ప్రదర్శనకు నిలబడడానికి తను ఏమాత్రం సిద్ధంగా లేనన్నాడు.

లారెన్స్ ఫెర్లింఘెట్టి

జానస్ పన్నానియస్ ఇంటర్నేషనల్ పొయెట్రీ ప్రైజ్ (2011)

లారెన్స్ ఫెర్లింఘెట్టి సుప్రసిద్ధ కవి. 'బీట్ ఉద్యమం'గా పేరొందిన అమెరికన్ సామాజిక సాహిత్య ఉద్యమకారుడు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని 'సిటీ లైట్స్ బుక్‌స్టోర్' యజమాని. ఇన్ని ప్రత్యేకతలున్న లారెన్స్‌కు... హంగేరియన్ పెన్ క్లబ్ ఇవ్వచూపిన 'జానస్ పన్నానియస్ ఇంటర్నేషనల్ పొయెట్రీ ప్రైజ్' (2011)ను తిరస్కరించాడు. 'భావ ప్రకటనా స్వేచ్ఛను, పౌర స్వేచ్ఛలను హరించే మితవాద రాజకీయాలు కలిగిన హంగేరీ ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థ ఇచ్చే అవార్డును నేనెలా స్వీకరిస్తాను?!' అన్నది లారెన్స్ ప్రశ్న.

లె డుక్ థో

నోబెల్ శాంతి బహుమతి (1973)

ఉత్తర వియత్నాం నాయకుడు లె డుక్ థో, అమెరికా జాతీయ భద్రతా సలహాదారు హెన్రీ కిస్సింగర్‌కు సంయుక్తంగా నోబెల్ శాంతి బహుమతి వరించింది. పారిస్ శాంతి ఒప్పందాలకు సంబంధించి పోషించిన పాత్రకు గాను ఆ ఇద్దరిని శాంతి నోబెల్‌కు ఎంపిక చేశారు. అయితే లె డుక్ థో నోబెల్‌ను తిరస్కరించాడు. దక్షిణ వియత్నాం, అమెరికాలు శాంతి ఒప్పందాలను ఉల్లంఘించిన కారణంగా నోబెల్‌ను అందుకోలేకపోతున్నానని వెల్లడించాడు.

మైఖేల్ హగ్‌టన్

కెనడా గార్డినర్ ఇంటర్నేషనల్ అవార్డు (2013)

కెనడాలోని అల్‌బెర్టా యూనివర్సిటీ ప్రొఫెసర్ హగ్‌టన్. 'హెపటైటిస్ –సి' కనుగొన్నందుకుగాను హగ్‌టన్‌తోపాటుగా, పాటుగా మరో ఇద్దరు అమెరికన్లకు 'కెనడా గార్డినర్ ఇంటర్నేషనల్ అవార్డు'ను ప్రకటించింది ప్రభుత్వం. అయితే... తనతోపాటు ఆ ఆవిష్కరణలో పాలుపంచుకొన్న క్వి లిమ్ చూ, జార్జ కు'లను అవార్డుకు ఎంపిక చేయనందుకు నిరసనగా ... హగ్‌టన్ సదరు పురస్కారాన్ని తిరస్కరించాడు.



చినువా అచాబె

కమేండర్ ఆఫ్ ది ఫెడరల్ రిపబ్లిక్ (2004, 2011)

నైజీరియా ప్రభుత్వం ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక గౌరవం 'కమేండర్ ఆఫ్ ది ఫెడరల్ రిపబ్లిక్'. ప్రసిద్ధ నవలా రచయిత చినువా అచాబెను ఈ అవార్డుతో గౌరవించాలని రెండు సార్లు ప్రయత్నించింది ప్రభుత్వం. తొలిసారిగా 2004లో ఇవ్వచూపినప్పుడు తిరస్కరించాడు చినువా. అదే అవార్డును తిరిగి 2011లో ఇవ్వడానికి ప్రయత్నించినప్పుడు ... ఆయన చెప్పిన మాటలు ప్రపంచాన్నే ఆలోచింపచేశాయి. "నేను మొదటిసారి ఏ కారణాల వల్లనైతే ...తిరస్కరించానో...వాటి గురించి ప్రస్తావించకుండా...మళ్లీ అవార్డు ఇవ్వాలనుకోవడంలో అర్ధంలేదు....." అన్నాడు. అంతేకాక.. దేశంలో నెలకొన్న భయానక పరిస్థితులు... హింస... అవినీతి కూడా ఆయనను కలవరపెట్టింది. వాటిపై ఆయన సంధించిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వలేకపోయింది. దాంతో ఆయన రెండు సార్లు 'కమేండర్....' అవార్డును తిరస్కరించాడు.

హరి కుంజ్రు

జాన్ లెవెల్లిన్ రిస్ ప్రైజ్ (2003)

భారతీయ సంతతికి చెందిన బ్రిటిష్ నవలాకారుడు హరి కుంజ్రు. తన తొలి నవల 'ది ఇంప్రెషనిస్ట్'కు 2003లో 'జాన్ లెవెల్లిన్ రిస్ ప్రైజ్' వరించింది. అయితే ఈ అవార్డును హరి కుంజ్రు తిరస్కరించాడు. ఈ అవార్డును 'మెయిల్ ఆన్ సండే' పత్రిక స్పాన్సర్ చేయడమే తన ప్రధాన అభ్యంతరంగా చెప్పాడా రచయిత. ప్రతి అక్షరంలోను జాతి వివక్షను కక్కే ఓ పత్రిక ఇస్తున్న అవార్డును... మిశ్రమ జాతికి చెందిన తానెలా అందుకుంటానన్నది అతని ప్రశ్న.

అరుంధతీ రాయ్

సాహిత్య అకాడెమీ అవార్డు (2006)



సామాజిక కార్యకర్త, బుకర్ ప్రైజ్ అందుకున్న నవలాకారిణి అరుంధతీ రాయ్. ఆమె రాజకీయ వ్యాస సంకలనం 'ది ఆల్జీబ్రా ఆఫ్ ఇన్‌ఫినిట్ జస్టిస్'కు ప్రతిష్టాత్మక సాహిత్య అకాడెమీ అవార్డు వరించింది. రాయ్ దానిని తిరస్కరిస్తూ చెప్పిన కారణాలివి. "భారీ ఆనకట్టలు, అణ్వాయుధాలు, సైనికీకరణను అంతకంతకూ పెంచడం...వంటి విధానాలను అవలంభించే ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న సంస్థ ఇచ్చే అవార్డును అందుకోలేను...'. రాయ్ తన పుస్తకంలో సదరు అంశాలను తీవ్రంగా విమర్శించారన్నది తెలిసిందే.

జి.జె బల్లార్డ్

కమేండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (2003)

బల్లార్డ్! ప్రసిద్ధ ఇంగ్లీషు నవలా రచయిత. ఆయన రాసిన 'ఎంపైర్ ఆఫ్ ది సన్, ది బర్నింగ్ వరల్డ్' నవలలు ప్రపంచ ఖ్యాతి పొందాయి. 'ఒక రిపబ్లికన్‌గా రాణిగారిచ్చే అవార్డును అంగీకరించలేను....' అంటూ 2003లో బ్రిటిష్ రాణి ఇవ్వచూపిన గౌరవాన్ని తిరస్కరించిన దమ్మున్న రచయితగా బల్లార్డ్ కీర్తి గడించాడు.



సైనియాడ్ ఒకన్నార్

గ్రామీ అవార్డు (1991)

ఐరిష్ గాయని, గేయ రచయిత సైనియాడ్ ఒకన్నార్. 'ఐ డు నాట్ వాంట్ వాట్ ఐ హేవ్ నాట్ గాట్' అనేది ఒకన్నార్ సూపర్ హిట్ ఆల్బమ్. దీనికి 1991లో గ్రామీ అవార్డు వచ్చినపప్పటికీ తిరస్కరించిందామె. 'ఎందుకిలా?' అని అడిగిన ప్రపంచానికి ఒకన్నార్ ఇచ్చిన సమాధానం ఇదే. 'కళ యొక్క వాణిజ్య పార్శ్వాన్ని మాత్రమే గుర్తిస్తుంది గ్రామీ' అని.





మన దేశ భాషలన్నింటిలోనూ, పూర్తిగా వచనంలో, అందులోకి వ్యవహారిక శైలిలో, మొట్టమొదటిసారిగా నాటకం రాసింది గురజాడ అప్పారావుగారనే అనుకుంటాను. సాంఘిక వాస్తవికత దర్పణంలో వలె యథాతథంగా ప్రతిబింబించిన కళాఖండం మన భాషలోనే కాదు, ఇతర భారతీయ భాషల్లోనైనా మొదటిదీ ఆఖరిదీ 'కన్యాశుల్కమే' అనుకుంటాను. కన్యాశుల్కం నాటకాన్ని ఆ తెగలో మించడం మాట అటుంచి, ఆ దరిదాపులకైనా రాగల నాటకం మన దేశంలో ఏదైనా ఉంటే దాని సంగతి ఇంతరకూ ఎవరికీ తెలియకపోవడం ఆశ్చర్యకరమే అని నేననుకుంటాను. - శ్రీశ్రీ

జీవిత నాటకం - కన్యాశుల్కం

అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం : శ్రీశ్రీ అకడమిక్ సంయమనం అధికంగా పాటించి "కన్యాశుల్కం' లాంటి నాటకం మన దేశంలో మరెక్కడా లేదు" అని ఖచ్చితంగా చెప్పకపోవడం. కన్యాశుల్కంలో వ్యక్తమయ్యే నిర్దుష్టమైన వాస్తవికతా ధోరణిని అవలంభించిన రచన... యూరోపియన్ నాటకరంగంలో కూడా కనీసం ఆనాటికి లేదని శ్రీశ్రీ రాయకపోవడమూ ఆశ్చర్యకరమే. శ్రీశ్రీకి ఆంధ్ర భక్తి మెండని అందరికీ తెలుసు. కాని పై వాక్యాలను ఎంత జాగ్రత్తగా - అతి జాగ్రత్తగా రాశాడో గమనిస్తే 1980 దశకంలో మాత్రమే కన్యాశుల్కం ప్రాముఖ్యత గురించి వేరే కోణం ఆవిష్కారం కావడం మాత్రం ఆశ్చర్యకరం కాదు. 1980కి ముందు కన్యాశుల్కం నాటకంలోని వాస్తవికతనూ, కళా సౌష్టవాన్ని, పాత్రల స్వభావాలనూ రకరకాలుగా వివరించి వ్యాఖ్యానించిన పెద్దలనేకులున్నారు. 'కన్యాశుల్కం' నాటకమే కాదనేవారి సంగతి రామప్పంతులు చెప్పినట్లు వేరే కథ. 1980 తర్వాత వాస్తవ జీవితంలోని నాటకీయత 'కాన్యాశుల్కం'లో గమనించడం ప్రారంభమౌంది. 'కన్యాశుల్కం' ఒక కల్పన కాదనీ, వాస్తవ జీవిత శకలాల పేర్పు అనీ, ఆ జీవిత శకలాల నేపథ్యంలో కథకో, నాటక రూపానికో పరిమితమైన వ్యవహారం కాదనీ... ఒక నూతన దృష్టి 1980 దశకంలో మాత్రమే వ్యక్తమైంది. నాటకంలో జీవితాన్ని అన్వేషించడం కంటే, జీవితంలోని నాటకీయతను గుర్తించడం మరింత ప్రయోజనకరమని నిర్ణయానికి రావడం ఇక్కడి ప్రధానాంశం. జీవితం - కళారూపం - జీవితం... ఇదొక పెద్ద గొలుసు. ఫలితంగా, కన్యాశుల్కం కథా వస్తువు, ఇతివృత్తం, నిర్మాణ వ్యూహం మొదలైన వివరాలకు పోకుండానే కొన్ని నిర్ణయాలకు రావచ్చును. 'కన్యాశుల్కం'లోని సంభాషణలన్నింటినీ 'గ్రంథస్తం చేసిన సంభాషణలు'గా పేర్కొనవచ్చు. ఎటూ వచ్చి గ్రంథస్థం చేయడంలో రచయిత తీసుకున్న జాగ్రత్త, చూపిన సంయమనం, ఆచరించిన నిజాయితీ... అన్నీ కలిసి కన్యాశుల్కాన్ని ఒక చారిత్రక పత్రంగా రూపొందించాయి. అంటే 'గ్రంథస్థం చేయడం' గొప్ప శ్రమతో కూడుకున్న వ్యవహారమన్న మాట. 1909కి ముందు రాసిన 'కొండు భట్టీయం'లోని కొన్ని సంభాషణలు, కొన్ని వివరాలు... 'కన్యాశుల్కం'లో చేరుకున్నాయని గమనిస్తే గురజాడ 'కన్యాశుల్కం' రచనను పరిపుష్టం చేయడానికి చేసిన 'వ్యాయామం' కూడా మనకు స్ఫురిస్తుంది. కథకూ, కథనానికీ అవసరమైన దృశ్యాలనూ, సంభాషణలను మాత్రమే 'పరిమితంగా' తీసుకుని ఉంటే 'కన్యాశుల్కం' ఒక నాటకంగా మాత్రమే మనకు గుర్తుండేది. అందుకు భిన్నంగా, ఒక నిర్దిష్ట ప్రాంతంలో, ఒక నిర్దిష్ట కాలంలో ఉన్న సామాజిక భావాల రాశి 'కన్యాశుల్కం'లో మనకు పుష్కలంగా లభిస్తోంది. కనుకనే దాన్ని మనం జీవితంలో భాగంగా చూడాల్సి వస్తోంది. ఆంధ్ర దేశపు సాంఘిక చరిత్ర రాయడానికి - ముఖ్యంగా కళింగాంధ్ర చరిత్ర - కన్యశుల్కం ఒక ఆధారంగా పనికొస్తుంది. ఈ సందర్భంలో గురజాడ 'కళింగాంధ్రదేశ చరిత్ర' రాశాడని గుర్తు పెట్టుకోవడం మరింత అవసరం. నడుస్తున్న చరిత్రను 'కన్యాశుల్కం' అక్షరబద్ధం చేసింది.

నిత్యనైమిత్తికాలు, బ్రిటీషు వలస విధానం, దాని వారసత్వం, సాంఘిక దురాచారాలు - సదాచారాలు - కూడా - సంస్కరణ, దేశ స్వాతంత్ర్యం, హ్రస్వదృష్టీ, దీర్ఘదృష్టీ, నిజాయితీ, ఆత్మవంచన, నైర్మల్యం, కౌటిల్యం, సారళ్యం, సంక్లిష్టత, ఆధర్మం, అవినీతి... ఇలా జీవితంలో తటస్థపడే ప్రతి అంశమూ కన్యాశుల్కంలో ప్రస్తావనకు వచ్చింది. అన్నింటికంటే ముఖ్యంగా ఆధునికతా స్వభావం గురించీ, సంప్రదాయ బద్ధతను గురించీ... అప్పుడు వ్యాప్తిలో ఉన్న భావాల ప్రకటన 'కన్యాశుల్కం'లో అనాచ్ఛాదితంగా కనబడుతుంది.

'కన్యశుల్కం' పాత్రలు అచ్చుటి సంకీర్ణ సమాజంలోని వ్యక్తులుగానే మనకు కనబడతాయి గాని, నాటకానికి "అవసరమైన" పాత్రల్లాగా కనబడవు. ఆయా పాత్రల ప్రవర్తన, ఆ పాత్రల అవసరాలనూ, ఆశలనూ, లక్ష్యాలనూ అంటిపెట్టుకుని ఉండడం కూడా అందువల్లనే విశిష్టంగా కాక, సహజంగా కనబడుతుంది. అలాగే, కన్యాశుల్కంలో కొన్ని పాత్రలు గురజాడ ఊహలను కూడా దాటిపోయి స్వకీయ వ్యక్తిత్వాన్ని రూపొందించుకుని గురజాడను 'ధిక్కరించాయ'ని కొందరు విమర్శకుల నింద. నిజానికి ఇది ప్రశంస. గురజాడ పరిశీలనకూ, నిజాయితీకి ఈ వ్యాఖ్య ఒక అద్భుతమైన కితాబు. అయితే గురజాడ జీవిత సంకీర్ణత వర్ణించడానికి ఎన్నుకున్న పాత్రలు, స్వభావాలు... స్థూలంగా ఒక ప్రణాళికను అనుసరించినట్లు కనబడుతుంది. నాటకంలోని పాత్రలను ఒక్కొక్కటిగా కాక, జంటలుగా రూపొందించాడు గురజాడ. (జంటలు అంటే స్వాభావికంగా అభిముఖమైన జంటలు). ఈ విధానం సమాజంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి అనుకూలంగా ఉండడమే కాక నాటకీయతా పోషణకు కూడా సౌష్ఠవాన్ని కూరుస్తుంది.

'కన్యాశుల్కం' నాటకంలో వర్ణితమైన సమాజానికి కొంచెం ఎడంగా ఉన్న పాత్ర గిరీశం పాత్ర. ఆ సమాజానికి అతడు

కొత్తవాడు. పరాయివాడు. ఒక పాత్రకూ అతడున్న సామాజిక వాతావరణానికీ మధ్య దూరమున్నప్పుడు విచిత్ర సంఘటనలు సన్నివేశాలు సహజమే. హనుమంతుని లంకాయాత్ర, ఊహా ప్రపంచంలో ఉండే డాన్‌క్విక్‌సెట్ చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచం, అభం శుభం తెలియని పార్వతీశం ఇంగ్లండు ప్రయాణం... ఇలా ప్రతిచోటా ఇదే పరిస్థితిని చూడవచ్చు. అయితే ఇక్కడ గిరీశం ఇంచుమించుగా మిగిలిన అన్ని పాత్రలకూ అభిముఖమైన పాత్రను పోషించాడు. గిరీశాన్ని మినహాయిస్తే... మిగతా పాత్రలను అభిముఖమైన జంటలుగా విడదీసి పరిశీలించవచ్చు. అనేక సమాన లక్షణాలుండి ఒకటి రెండు అంశాల్లో పూర్తి భిన్నమైన లక్షణాలను కలిగిన రెండు పాత్రలను అభిముఖమైన పాత్రలుగా నిర్వచించుకోవచ్చు. అభిముఖ స్వభావాలను వర్ణించడంలో అనేకత్వాన్ని ఆవిష్కరించడమే గురజాడ లక్ష్యం.

అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు... జంటనే తీసుకుందాం. ఇద్దరిదీ ఇంచుమించు ఒకే రకమైన వారసత్వమే. అయితే అగ్నిహోత్రావధాన్లు మరికొంచెం ఎక్కువగానే సంప్రదాయ విద్యాగంధం కలవాడు. మరోవైపున తన వ్యవహారాలు తానే చూసుకునేవాడు. సంప్రదాయాల్లోనూ, సాంస్కృతిక వారసత్వంలోనూ తరతమ భేదాలతో ఒక సమూహానికి చెందినవారే. అయితే లుబ్ధావధాన్లుకు అనుభవం వల్ల చివరికి పశ్చాత్తాపం లాంటి ఆలోచనలు వస్తాయి. అగ్నిహోత్రావధాన్లు 'సర్వజ్ఞుడు' "సందేహాలు లేనివాడు...". అందువల్ల అతనిలో మార్పు అసంభవం. ఇలా నాటకంలో మిగతా పాత్రలను జంటలుగా గమనించవచ్చు.

మహేశం – వెంకటేశం, పూటకూళ్లమ్మ – మీనాక్షి, కొండిభొట్లు – కాబొట్లు, గిరీశం – బైరాగి, గిరీశం – రామప్పంతులు, రామప్పంతులు – కరటక శాస్త్రి... ఇలా జంటలను పెంచుకుంటూ పోవచ్చు. పాత్రల గతితార్కిక వైవిధ్యమే 'కన్యాశుల్కం' ప్రత్యేకత అని సరిపెట్టుకోనక్కర్లేదు. అలాగే సమాజంలోని పొరలన్నింటినీ పరిశీలించడానికీ, ఆవిష్కరించడానికీ చేసిన ప్రయత్నం వల్లనే 'కన్యాశుల్కం'లో సంకీర్ణత ఒకోసారి మరీ సరళంగా కూడా కనబడుతుంది. అంటే సంకీర్ణత, సారళ్యం జంటగా 'కన్యాశుల్కం'

" మన జీవితంలో కూడా ఇది సాధారణమే. ఎందుచేతనో ఎక్కువమంది పని చేసుకునే పిల్లలకు లక్ష్మి అనే పేరు ఉండడం మనం గమనించవచ్చు. అసిరిగాడు అనే పేరు ఎంత సాధారణమైనదో, అతని వ్యక్తిత్వం అంత సంకీర్ణమైంది కూడా. అతనికి దయ్యాలమీద నమ్మకం లేదు. కానీ 'రెండు దయ్యాల బరువు' ఉందో లేదో చూడమని సీసా చేతికిచ్చినప్పుడు "ఓలమ్మ! ఎంత బలువుందోస్సి" అంటాడు! "దయ్యాలకు పెట్టింది తింతున్నారా!" అని రామప్పంతులును భయపెడతాడు (మీనాక్షి ఇచ్చిన పలహారం తింటున్నప్పుడు). "

నాటకమంతటా ఆవరించి ఉండడం గమనించవచ్చు.

అసిరిగాడి పాత్రనే తీసుకుంటే, అతడు సర్వ సాధారణమైన వ్యక్తిగా కనబడతాడు. అన్నట్టు అగ్నిహోత్రావధాన్లు నౌకరు పేరు కూడా అసిరిగాడు కావడం యాదృచ్ఛికం కాదు. ఈ సాధారణతను వ్యక్తం చేయడానికే ఆ పేరు. మన జీవితంలో కూడా ఇది సాధారణమే. ఎందుచేతనో ఎక్కువమంది పని చేసుకునే పిల్లలకు లక్ష్మి అనే పేరు ఉండడం మనం గమనించవచ్చు. అసిరిగాడు అనే పేరు ఎంత సాధారణమైనదో, అతని వ్యక్తిత్వం అంత సంకీర్ణమైంది కూడా. అతనికి దయ్యాలమీద నమ్మకం లేదు. కానీ 'రెండు దయ్యాల బరువు' ఉందో లేదో చూడమని సీసా చేతికిచ్చినప్పుడు "ఓలమ్మ! ఎంత బలువుందోస్సి" అంటాడు! "దయ్యాలకు పెట్టింది తింతున్నారా!" అని రామప్పంతులును భయపెడతాడు (మీనాక్షి ఇచ్చిన పలహారం తింటున్నప్పుడు). అలాగే 'అదృశ్యంగా బైరాగి తన వెంట వస్తున్నాడ'ని గవరయ్య చెప్పినప్పుడు కూడా, 'నా కళ్లకు కనపడుతున్నాడే' అని సమాధానం చెప్పిన అసిరిగాడు "కల్లాకపటం లేనివాడ"ని – అందుకే అతడు బైరాగిని చూడగలుగుతున్నాడని భావం. గవరయ్య కితాబు సంపాదిస్తాడు. అన్నింటినీ మించి అతడు రామప్పంతులుకూ మీనాక్షికీ ఉన్న లైంగిక సంబంధాన్ని తైపారు వేసిన విధానం ఆశ్చర్యకరం! అతడికి రామప్పంతులు పట్ల ఇసుమంత గౌరవం కూడా లేదు. లుబ్ధావధాన్లు రామప్పంతులును కర్రతో కొట్టినప్పుడు "చచ్చాన్రా! కాలెవిక విరిగిపోయిందా"ని మొరపెట్టినప్పుడు "కానేళ ఇంట్లో జొరబడితే బుగత కొట్టడా?" అని నిర్దాక్షిణ్యంగా వ్యాఖ్యానిస్తాడు. అదే అసిరిగాడు మీనాక్షికి పిలవమని రామప్పంతులు చెప్పినప్పుడు, అతని దగ్గర డబ్బులు గుంజుతాడు. అయితే మీనాక్షి పట్ల అతనికి ఇంచుకంత కూడా ఏహ్యభావం ఉన్నట్లు దాఖలా లేదు. అతని నైతిక చట్రంలో లైంగిక సంబంధం మీనాక్షికి సహజమైన అవసరం. రామప్పంతులు వస్తుతహ దుర్మార్గుడు. అందువల్ల అతనికి శిక్ష పడడం అవసరం. లుబ్ధావధాన్లు సమాజ నీతులకు అసిరిగాడు భిన్నమైనవాడు. సహజంగా ఉత్తముడు. అందువల్ల 'కన్యాశుల్కం' పాత్రలో నైతిక నియమావళి ప్రకారం పరిశీలించినప్పుడు అసిరిగాడు మధురవాణితో సరిపోగలడు. అసిరిగానిలో సాధారణత, సంక్లిష్టత పెనవేసుకుని ఉండడం వల్ల అతని పాత్ర ఒక సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుంది.

ఈ రకంగా విశ్లేషించుకుంటూ పోతే, కొండిభొట్లు, పూటకూళ్లమ్మ, మునిసిబు నాయకులు. వీరేశ, మనవాళ్లయ్య, సారా దుకాణదారు రామందాసు... ఇలా అన్ని పాత్రలలోనూ సాధారణత, సంక్లిష్టత కలిసి ఉండడం గమనించవచ్చు.

ఇదే విధంగా, 'కన్యాశుల్కం'లోని అంకాలూ, రంగాలూ... ఇటు సాధారణతనూ, సంక్లిష్టతనూ సంతరించుకున్నట్లుగా గుర్తించడానికి పెద్ద శ్రమ పడనక్కర్లేదు (అది మరోసారి చూద్దాం). అయితే పాత్రల అభిముఖత, పాత్రలలోని ద్వంద్వ లక్షణాలూ, దృశ్యాలలోని 'వైరుధ్య సంపుటి' మొత్తం జీవితం నుంచి వచ్చినవే. జీవితం కూడా ఒకేసారి సరళంగానూ, సంక్లిష్టంగానూ ఉండడం గమనించవచ్చు. అందువల్ల 'కన్యాశుల్కం' సంకీర్ణత జీవితపు సంకీర్ణతే.

(సృజన 200వ సంచిక, 1992.)

- హరిపురుషోత్తమరావు

గురజాడ వర్ధంతి సందర్భంగా...

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

సీరియల్



మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

'యూదు సమస్య'లో మతాన్ని ఒక ఆధ్యాత్మిక విషయంగా కాక, సామాజిక, రాజకీయ అంశంగా పరిశీలించాడు మార్క్స్. పందొమ్మిదవ శతాబ్ది ప్రథమార్థంలో, జర్మనీలోని యూదులు ఎక్కువగా వాణిజ్య, ఆర్థిక రంగాలలో తమ కార్యకలాపాలు కొనసాగించారు. ప్రత్యేకంగా చట్టమేమీ లేకపోయినా, ప్రభుత్వం వాళ్లకు ఈ రంగాలలో మాత్రమే అనుమతిచ్చింది. ఈ కారణంగానే, సమాజం వాళ్లను చూసే తీరు కూడా ప్రభావితమైంది.

ప్రస్తుత (1840) జర్మనీలో మతం పోషిస్తున్న పాత్ర ఏమిటి? రాజకీయాల్లో క్రిస్టియన్లూ, వాణిజ్య, ఆర్థిక రంగాలలో యూదులు బలంగా ఉన్నారు. మరి, మతం నుండి స్వేచ్ఛ అంటే ఏమిటి? యూదులకు మతం నుండి స్వేచ్ఛను కల్పిస్తే – అంటే ఆర్థిక రంగం నుండి దూరం చేస్తే – రాజ్య నిర్వహణకే ప్రమాదం రావచ్చు. ఇది జర్మనీలో సామాజిక విప్లవానికి దారితీస్తుంది. రాజ్యాన్ని నిలబెట్టిన ఒక స్తంభం – ఆర్థిక రంగం – కూలిపోతే ప్రభుత్వమే కూలిపోతుంది. అదే

" మార్క్స్ మొదటి సంతానం మే 1, 1844 నాడు జన్మించింది. తనకు లిటిల్ జెన్నీ లేక జెన్నీ చెన్ అని నామకరణం చేశారు. పేరు తల్లిదైనా అంతా తండ్రి పోలికే. అవే నల్ల కళ్లు. దట్టమైన జుత్తు. పిల్లల్ని పెంచటమెలాగో ఇద్దరికీ తెలియదు. జెన్నీ పెరిగిన ఇంట్లో కావలసినంత మంది మనుషులుండేవారు. పిల్లలు పుట్టగానే ఆలనాపాలనా అంతా వాళ్లే చూసుకునేవారు. ఏడుగురు సోదరీ సోదరులున్నా మార్క్స్ ఒంటరి పిల్లాడిగానే పెరిగాడు. "

మార్క్స్‌కు కావలసింది.

రూగ్ పత్రిక ఆగిపోయేనాటికి జెన్నీ ఏడు నెలల గర్భవతి. మార్క్స్ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. ఇద్దరికీ పత్రిక రాజకీయ స్వభావం గురించి విభేదాలున్నాయి. ఇప్పుడు ఇద్దరూ కలిసి హెర్వీగ్‌తో యుద్ధం చెయ్యవలసి వచ్చింది. రూగ్‌కు అతడి ప్రవర్తన అస్సలు నచ్చలేదు –'పారిస్ తళుకు బెళుకులు అతణ్ణి మైకంలో ముంచాయి. డబ్బున్న వాళ్ల ఇళ్లలో విదూషకుడిగా మారాడు. పడతుల అందచందాలకు లొంగిపోయాడు – హెర్వీగ్'. కౌంటెస్ డాగూల్ట్‌తో అతడి సంబంధాన్ని కూడా తప్పుబట్టాడు రూగ్. అతడు చెప్పిందంతా ప్రశాంతంగా విని, ఇంటికెళ్లి, హెర్వీగ్ సమర్థిస్తూ, రూగ్‌ది సంకుచిత స్వభావమంటూ ఓ లేఖ రాశాడు మార్క్స్. నిజానికి ఈ పోట్లాటలన్నింటికీ అసలు కారణం డబ్బు అయి ఉంటుంది. మార్క్స్ నెల జీతం బదులు, పత్రిక కాపీలిస్తానన్నాడు రూగ్. మార్కెట్లో అమ్ముడుపోని పత్రిక కాపీలు ఎవరైనా ఏం చేసుకుంటారు! ఆ సమయంలో మార్క్స్‌కు డబ్బు అత్యవసరం. రూగ్ దగ్గర నిజంగా డబ్బు లేదా అంటే, కొద్దిరోజుల క్రితమే రైల్వేస్టాక్స్‌లో లాభం కూడా వచ్చింది.

మార్క్స్, ఇక తాను రోడ్డున పడతానేమో అనుకుంటున్న సమయంలో, జార్జి యుంగ్, కొలోన్‌లో వుంటున్న రైనిష్ జైటుంగ్ స్టాక్ హోల్డర్లు (వాటాదార్లు) రూగ్ పత్రిక ద్వారా వచ్చే ఆదాయానికి రెట్టింపు మొత్తం పంపారు. తనకు బదులు మరొకరు మార్క్స్‌కు సహాయం చెయ్యటం రూగ్‌కు కోపం తెప్పించింది. మార్క్స్ దంపతులు షాపింగ్ మీద బాగా తగలేస్తున్నారంటూ ఫ్రోబెక్‌కు ఫిర్యాదు చేశాడు రూగ్.

"మార్క్స్ కోరికలకు అంతు లేదు.

చూసిందంతా కావాలంటాడు". మరోసారి, "ఇతడు ఓ వింత మనిషి. రచయితగా గొప్పవాడే. కాని విలేకరిగా పనికిరాడు. విపరీతంగా చదువుతాడు. కష్టపడి పనిచేస్తాడు. కాని ప్రారంభించిన ఏ పనీ ముగించడు. పుస్తకాల సముద్రంలో ఈదులాడటం అతడికిష్టం". అని కూడా ఫిర్యాదు చేశాడు. మార్క్స్ మాత్రం వూరుకుంటాడా!' ఎందుకూ కొరగాని మూర్ఖుడు' అంటూ రూగ్‌ను ఎద్దేవా చేశాడు.

మార్క్స్ మొదటి సంతానం మే 1, 1844 నాడు జన్మించింది. తనకు లిటిల్ జెన్నీ లేక జెన్నీ చెన్ అని నామకరణం చేశారు. పేరు తల్లిదైనా అంతా తండ్రి పోలికే. అవే నల్ల కళ్లు. దట్టమైన జుత్తు. పిల్లల్ని పెంచటమెలాగో ఇద్దరికీ తెలియదు. జెన్నీ పెరిగిన ఇంట్లో కావలసినంత మంది మనుషులుండేవారు. పిల్లలు పుట్టగానే ఆలనాపాలనా అంతా వాళ్లే చూసుకునేవారు. ఏడుగురు సోదరీ సోదరులున్నా మార్క్స్ ఒంటరి పిల్లాడిగానే పెరిగాడు. కుటుంబంతో ఎప్పుడూ పెద్దగా సంబంధాలు లేవు. సాయంత్రం అయిదు గంటలకు లేచి, తెల్లారి అయిదింటిదాకా కేఫ్‌లలో, మద్యశాలలో కాలక్షేపం చేసేవాళ్ల బొహిమియన్ మిత్రుల వల్ల ఉపయోగం లేదు. అందువల్ల, దంపతులిద్దరూ కలిసి, తమకు తెలిసిన పద్ధతిలో పెంచాలనుకున్నారు. కానీ ఒకనాడు చంటిపిల్లకు తీవ్రంగా జబ్బు చేసింది.

అప్పుడు, అనూహ్యంగా ఓ వ్యక్తి ఆదుకున్నాడు. ఆయనే హైన్రిష్ హైన్ – నలభై ఆరేళ్ల కవి. ఆయనకే ఆరోగ్యం బాగోలేదు. పాక్షికమైన పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. స్వయంగా పిల్లల్ని కని పెంచిన అనుభవమూ లేదు. అయినా, అవస్థపడుతూ, మార్క్స్ అపార్ట్‌మెంట్ మెట్లెక్కి వచ్చి పిల్లకు అండగా నిల్చాడు. మొదట వేడినీళ్లతో స్నానం చేయించాడు. జెన్నీచెన్ కోలుకుంది కాని, తల్లిదండ్రులు మాత్రం షాక్ నుండి కోలుకోలేదు. 'జెన్నీ, కూతుర్ని ట్రీయర్‌కు తీసుకుపోవాలి. అక్కడ ఆమె తల్లి కొన్నాళ్లపాటు శిశువును కాపాడుతుంది'. ఇదీ వాళ్లు తీసుకున్న నిర్ణయం.

చంటిపిల్లను తీసుకుని రైన్‌లాండ్‌కు బయల్దేరింది జెన్నీ. అది జూన్ మాసం. పారిస్‌లో కార్ల్ ఒక్కడే ఉంటాడు. పుట్టింటికైతే బయల్దేరింది గాని జెన్నీ మనసు ఆందోళనగానే వుంది. పెళ్లై ఇంకా ఏడాది కూడా కాలేదు. ఒంటరిగా ఉన్న కార్ల్‌ను పారిస్ నగర అందాలు రెచ్చగొట్టకుండా ఉంటాయా! కోరికలు కలగాలే గాని, అక్కడ అవి తీరటం చాలా సులభం.

జెన్నీ దిగులు పడవలసిన అవసరం లేదు. ఆమె లేని సమయంలో మార్క్స్ కొత్త లోకాన్ని అన్వేషించాడు. అయితే అది పడచు అందగత్తెల లోకం కాదు. ఆయన అన్వేషించింది ఎవ్వరికీ ఓ పట్టాన అర్థంకాని ఆర్థికలోక రహస్యాలను.

పారిస్, 1844

ఉద్యోగం లేకపోవటం కూడా ఒక వరమే.

హైన్రిష్ హైన్

బకూనిన్

" జెన్నీ దిగులు పడవలసిన అవసరం లేదు. ఆమె లేని సమయంలో మార్క్స్ కొత్త లోకాన్ని అన్వేషించాడు. అయితే అది పడచు అందగత్తెల లోకం కాదు. ఆయన అన్వేషించింది ఎవ్వరికీ ఓ పట్టాన అర్థంకాని ఆర్థికలోక రహస్యాలను. "

ఇప్పుడు మళ్లీ క్లాసు రూముల్లో కూర్చుని పాఠాలు నేర్చుకోవచ్చు. అయితే ఇప్పుడు గాస్ లైట్ల వెలుగులో, దట్టమైన సిగార్ పొగలతో నిండిన కేఫ్‌లు, సెల్లార్లు, చిన్న చిన్న ఆఫీసు గదులే క్లాస్ రూంలు. ఇక్కడ ఉపన్యాసాలుండవు. చర్చలు మాత్రమే. అందరూ బిగ్గరగా గొంతు చించుకుని అరుస్తారు. కొన్నిసార్లు ఒకరి మాటలు ఒకరికి వినిపించవు. కొత్తవాళ్లు ప్రవేశించి, ఏం జరుగుతుందో అర్థంగాక ఎగాదిగా చూస్తారు. అన్ని దేశాల వాళ్లు, అన్ని భాషల్లో సోషలిజం, కమ్యూనిజం, నేషనలిజం, లిబరలిజం, డెమోక్రసీల గురించి మాట్లాడతారు. ప్రభుత్వాలను ఉన్నపళంగా పడగొట్టేలా, నూతన సమాజాన్ని నిర్మించటమంటే ప్రస్తుత సమాజాన్ని సమూలంగా ధ్వంసం చెయ్యటమా? అధికార వర్గాలకు అర్జీలు పెట్టుకుని మౌలిక హక్కులు సాధించుకోవటం సాధ్యమా? – ఇలా ఒకటేమిటి! అన్ని రకాల అభిప్రాయాలకూ సమర్థకులున్నారు. వ్యతిరేకించిన వాళ్లూ వున్నారు. రాచరిక వ్యవస్థ మారాలని ఒకరంటారు. లేదు.. లేదు... దాన్ని తక్షణం నిర్మూలించాలంటారు మరికొందరు. అధికారం బూర్జువా వర్గాలు, పారిశ్రామికవేత్తల చేతిలో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం. అప్పుడే ఉత్పత్తి పెరుగుతుంది. మార్కెట్లు విస్తరిస్తే వినియోగ వస్తువులు అందరికీ అందుబాటులోకి వస్తాయి అన్నది ఒక వాదన. లేదు... ఈ అభివృద్ధే పేదల పాలిట శాపం. పారిశ్రామికీకరణను నడిపే ఇంధనం అభివృద్ధి కాదు. దురాశ, లాభాల వేట వాళ్ల గమ్యం. సంపద పెంచుకునే క్రమంలో అది సృష్టించిన, సృష్టిస్తున్న కార్మికులనే వాళ్లు తమ ధన దేవతకు బలిస్తున్నారు. పారిస్‌లోని క్లాస్ రూముల్లో మార్క్స్ విన్న పాఠాలివి.

మొత్తంమీద ప్రభుత్వాల స్వరూప, స్వభావాలు మారవలసిన తక్షణ అవసరం అందరూ గుర్తించారు. సమాజంలో మార్పొచ్చింది. ఇప్పుడు రాజులు, రారాజులు తమ వంధిమాగధులతో, భట్రాజులతో, చుట్టూ చేరి భజన చేసే గుంట నక్కలతో బుడబుక్కల వాళ్లలాగ, పిట్టల దొరలలాగ కనిపిస్తున్నారు. రాజరికాలకిక కాలం చెల్లింది. ఆ వ్యవస్థ ఇక కొనసాగే అవకాశం లేదు. అయినప్పటికీ, సామాజిక, ఆర్థిక ప్రగతికి వాళ్లింకా అడ్డు తగులుతున్నారు. అందరికీ ఈ విషయం గురించి ఏకాభిప్రాయం కుదిరినా, రాబోయే కొత్త వ్యవస్థ ఎలా ఉండాలో మాత్రం తేల్చుకోలేకపోయారు.

జెన్నీ ట్రీయర్‌కు వెళ్లటానికి ముందు మార్చిలో మార్క్స్ ఒక విందుకు హాజరయ్యాడు. అక్కడ అంశాలన్నీ చర్చించారు. తరువాతి ముప్పై సంవత్సరాలలో యూరోపియన్ విప్లవ రాజకీయాలలో ముఖ్య పాత్రలు పోషించబోయే వాళ్లలో చాలామంది వున్నారక్కడ. మార్క్స్‌కు సంబంధించినంత వరకూ అందులోని ముఖ్యవక్తలిద్దరు : ఒకరు మిహైల్ బకూనిన్. మరొకరు లూయీ బ్లాంక్.

రష్యన్ కౌంట్ కుమారుడు బకూనిన్. తండ్రికున్న చాలా పెద్ద ఎస్టేట్‌కు, 500 మంది అర్ధబానిసలకు యజమాని. మిలిటరీ ట్రెయినింగ్ పూర్తిచేసి, సైన్యంలో చేరటం ఇష్టంలేక 1840లో బెర్లిన్ చేరుకున్నాడు బకూనిన్. అక్కడే, యంగ్ హెగెలియన్‌లలోని రష్యన్ బృందంతో పరిచయం పెరిగింది. అలాంటి ఒక యంగ్ హెగెలియన్, తరువాతి కాలంలోని ప్రముఖ రష్యన్ నవలా రచయిత ఇవాన్ యర్గెనీవ్. ('నిహిలిజం' అనే మాటను తొలిసారి వాడింది ఈయనే.) బకూనిన్‌కు మర్గెనీవ్‌తో మంచి దోస్తీ కుదిరింది.

ఆ తర్వాత, దేశదేశాలు తిరిగి, విప్లవకారుడిగా పేరు గడించి పారిస్ చేరుకున్నాడు బకూనిన్. మార్క్స్ కన్నా నాలుగేళ్లు పెద్ద. అయినా మేధోపరంగా మార్క్స్ తనకన్నా ఎంతో వున్నతుడని స్వయంగా ప్రకటించాడు. అయితే, ఇద్దరి మధ్యా ఎప్పుడూ సఖ్యత లేదు. అభిప్రాయాలలో,

అవగాహనలో కూడా చాలా వ్యత్యాసం ఉంది. 'అతడు నన్ను సెంటిమెంటల్ అయిడియలిస్ట్ అన్నాడు. 'నేను అతణ్ణి అహంభావి, నమ్మక ద్రోహి' అన్నాను అని రాసుకున్నాడు బకూనిన్.

1844లో లూయీ బ్లాంక్ వయసు ముప్పై మూడు. అప్పటికే అతడు ఫ్రాన్సులోని ప్రముఖ సోషలిస్టులలో ఒకడు. సన్నగా, బక్కపలచగా ఉంటాడు. ప్రజాస్వామిక ప్రభుత్వం కార్మికుల స్వాధీనంలో ఉండాలంటూ 1840లో ఒక పుస్తకం ప్రచురించాడు. లూయీ ఫిలిప్ దుష్టపాలనను వివరించిన మరో పుస్తకం 'హిస్టరీ ఆఫ్ టెన్ ఇయర్స్' కూడా ఆయన రచనే. 1843లో ఒక పత్రికకు సహ వ్యవస్థాకుడిగా వ్యవహరించాడు. 'రాజరికం అంతరించాలి, అందరికీ ఓటుహక్కు, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం కావాలి' అని ప్రచారం చేశాడు.



బ్లాంక్‌కు కూడా, బకూనిన్ లాగానే మార్క్స్‌తో ఎప్పుడూ పొసగలేదు. వీళ్లు మొదటిసారి విందులో కలిసేనాటికి అందర్నీ ఒక గొడుగు కిందకి తేగల అంతర్జాతీయ సంస్థ ఏదీ లేదు. ఎవరి ప్రాంతీయ సమస్యలు వారివి కావటం కూడా ఒక కారణం కావచ్చు. అయినప్పటికీ, ఇంచుమించు అన్ని దేశాల ఉదారవాదులూ జన్మతః అధికారం సంక్రమించే రాజరికాలు కాక, ప్రజలెన్నుకునే ప్రజాస్వామ్యాలు కావాలని వాదించారు. వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ, ఆస్తిహక్కులు వాళ్ల డిమాండ్లు. ఒకవేళ రాజు ఉన్నప్పటికీ, రాజ్యాంగం కూడా ఉండక తప్పదన్నారు. రాడికల్స్ కూడా ఉదారవాదులే. కాని వీళ్లు రాజరికాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. సామాజిక సంస్కరణలతోపాటు, సార్వత్రిక ఓటు హక్కు కూడా కావాలన్నారు. జాతీయవాదులు కూడా ఉదారవాదులే. కాని వాళ్లకు భాష, సంస్కృతి, కళలు ముఖ్యం. సోషలిస్టులు ప్రైవేటు ఆస్తి ఉండకూడదన్నారు' వారసత్వ ఆస్తిహక్కు మిషతో బలహీనులు, ఏ పనీ చెయ్యక నిరర్ధకంగా గడిపేవాళ్లు సంపన్నులవుతున్నారు. సంపద సృష్టికర్తలు వాళ్లను పోషిస్తున్నారు" అయితే, అప్పటికి అందరివాదనలూ సిద్ధాంతాలకే పరిమితమైనాయి. అన్నీ చర్చిస్తున్నారే తప్ప ఎవరికీ పెద్దగా ప్రజల మద్దతు లేదు. సైన్యం మద్దతు అసలే లేదు. దీనికి కారణం తెలుసుకోవటం సులభమే. కార్మికవర్గమే విప్లవ సైన్యమన్నాడు మార్క్స్. కాని కార్మికులకు మధ్యతరగతి సంస్కరణవాదులన్నా, వాళ్లు ప్రచారం చేస్తున్న విప్లవ భావజాలం పట్లా నమ్మకం లేదు. వీళ్లంతా మానవాళి విముక్తి అభ్యుదయం అంటున్నారే తప్ప వ్యక్తుల భౌతిక అవసరాల గురించి మాట్లాడటం లేదు. ఇలా, ఎవరెన్ని 'ఇజం'ల గురించి మాట్లాడినా ఎవరూ సమస్యను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారనుకున్నాడు మార్క్స్. ఈ విషయాన్ని కూలంకషంగా అవగాహన చేసుకుంటే తప్ప 'మార్పు' సాధ్యం కాదు. అదేదో తెలుసుకోవలసిందే అంటూ తన అన్వేషణ ప్రారంభించాడు.

పారిస్‌లో వుంటున్న ఇద్దరు జర్మన్ల పరిచయం ఇందుకు కొంత దోహదం చేసింది. ఆగస్ట్ హెర్మన్ ఎవర్‌బెక్, జెర్మేన్ మారర్‌లు (రహస్య బృందం) లీగ్ ఆఫ్ జస్ట్ సభ్యులు. పారిస్‌లో వుంటున్న కార్మికవర్గ జర్మన్ కాందిశీకులతో 1836లో ఏర్పాటైందీ లీగ్. వీళ్లు కొంత బహిరంగ ప్రచారమూ చేస్తారు. మరికొన్ని రహస్య కార్యకలాపాలూ కొనసాగిస్తారు. ఫ్రెంచి కమ్యూనిస్టులతో ప్రేరణ పొందారు. సమాజాన్ని సమూలంగా మార్చాలంటే ప్రైవేటు ఆస్తిని రద్దు చెయ్యటం తప్పనిసరని నమ్మారు. వీళ్ల సమావేశాలకూ ఫ్రెంచి కమ్యూనిస్టుల సమావేశాలకూ హాజరైన మార్క్స్ మేధావుల పడక్కుర్చీ చర్చలకన్నా వీళ్ల నిబద్ధతలో నిజాయితీ వుందని గ్రహించాడు. 'మానవ సౌభ్రాతృత్వమనేది కేవలం మాటలకే పరిమితం కాలేదు. అది వాళ్లకు జీవిత సత్యం' అని రాసుకున్నాడు.'చాలీచాలని జీతాలతో పనిచేసిన వాళ్ల మొహాల్లో పరాయీకరణ స్పష్టంగా కనిపించింది. కాయ కష్టం చేసింది వీళ్లు. లాభపడింది ఫ్యాక్టరీ యజమానులు".

ఈ సమావేశాలతో ప్రేరణ పొంది, ఫ్రెంచి ఇంగ్లీష్ ఆర్థిక శాస్త్రవేత్తల గ్రంథాలు అధ్యయనం చెయ్యటం ప్రారంభించాడు త్వరలోనే మార్క్స్ నోట్ బుక్కులన్నీ నిండిపోయాయి. అసంపూర్తిగా ఉన్న నోటుబుక్కులే మనకు తెలిసిన 1844 Manuscripts లేదా “Economic and philosophical Manuscripts”. మార్క్స్ ఆ తర్వాత, జీవితాంతం కొనసాగించిన కృషికి ప్రాతిపదిక ఈ నోట్‌బుక్స్.

సశేషం

▪ **ఫోన్: 91776 18708**

◆ కార్టూన్ కదంబం







కేశాల కారు

అలంకరణ అనేది ఇలాగే వుండాలి. దీనితోనే చేయాలి అనే నిబంధనలు ఏం లేవు. ఈ ప్రపంచంలో ఎవరు ఎలాగైనా తమను, తమ వస్తువులను అలంకరించుకునే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వున్నాయి పుల్లుగా. ఇదిగో మీ ముందుకొచ్చిన కారు అలా అలంకరించబడినదే. పూర్తిగా మానవ కేశాలతో దీన్ని ఎంత అందంగా తీర్చిదిద్దారో చూశారుగా. ఈ ఘనత ఇటలీకి చెందిన మేరియా లూసియా మంగో అనే మహిళదే. 2010లో అత్యధిక కేశాలతో అలంకరించబడిన కారుగా రికార్డు సృష్టించిందీవిడ. అయితే తన రికార్డును తనే బద్దలు కొట్టింది ఈ మధ్యే. ఎలా సాధ్యమైందనుకుంటున్నారా? మరో పాతిక కేజీల వెంట్రుకలతో అలంకరించి మరీ... గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కింది. ఇందుకోసం 150 గంటల సమయాన్ని వెచ్చించిందట. లూసియా సహనానికి గిన్నిసేం ఖర్మ. ఇంక అంతకన్నా గొప్ప రికార్డే ఇవ్వాలి. ఏమంటారు?!

టేస్ట్ అదిరెన్

నిజంగానే ఈ ఆర్టిస్టుకు మంచి టేస్ట్ వుందండోయ్. నాలుకతో చకచకా ఎలా బొమ్మలు వేసేస్తున్నాడో చూశారుగా. ఈ చైనా కళాకారుడి పేరు హన్ జియోమింగ్. ఇతను అనుకోకుండా నీళ్లల్లో ఫుడ్ కలర్స్ కలిపి బొమ్మ వేశాడు. అదీ నాలుకతో. ఇంక అప్పటి నుంచి ఆ పద్ధతినే ఫాలో అయిపోతున్నాడు. పూలు, కాయలు, పక్షులు, చెట్లు వేసేస్తాడు సులభంగా.

 బ్రష్షుతో కన్నా నాలుకతో వేయడమే బాగుందన్నది జియోమింగ్ అభిప్రాయం. చైనాలోని ప్రధాన నగరాల్లో పర్యటిస్తూ ... బహిరంగ ప్రదేశాల్లో నిలబడి... ఇలా బొమ్మలు వేస్తుంటాడు. జనం స్వయంగా చూసి...తెగ ముచ్చటపడిపోయి ... నాలుక చిత్రాలను కొనేస్తుంటారు. అన్నట్టు ... ప్రపంచం మొత్తంలో ఇతను ఒక్కడే నాలుకతో బొమ్మలు వేసే కళాకారుడు అనుకుంటున్నారేమో! కేరళలో అని కె అనే అతను కూడా వేస్తాడు. అయితే అతను వాటర్ కలర్స్ కాక... అయిల్ పెయింట్స్ వాడతాడు.

మెట్లు ఎక్కగలరా?

అందుకే అంటారు వింత లోకం అని. చూశారా! మెట్ల పైకి ఎంత హుషారుగా ఎక్కేస్తున్నారో? పేరుకి మెట్లే గానీ పర్వతం మీదికి ఎక్కాలి. నైసెన్ అనే ఈ పర్వతం స్విట్జర్లాండ్‌లో వుంది. దీనిమీద మొత్తం 11,674 మెట్లు వుంటాయి. ప్రపంచంలోకెల్లా అతి పొడవాటి మెట్లు ఇవేనంట. 3.4 కిమీ పొడవుంటాయి లెండి. ఏడాదికో మారు... జూన్ మాసంలో ... మాత్రమే దీని మీదకి జనాన్ని అనుమతిస్తారు. అదీ పోటీకి మాత్రమే. పోటీలో పాల్గొనదల్చినవారు ఏడాది ముందుగానే తమ పేరు నమోదు చేయించుకోవాలి. ఇంతచేసినా ఒక్కోసారి పోటీ జరుగుతుందన్న గ్యారంటీ ఏం లేదు. పోయినసారి మంచు ఎక్కువగా కురవడంతో పోటీని రద్దు చేశారు. దాంతో పాపం ఏడాదిపాటు ఎదురుచూసిన వారంతా నిరుత్సాహపడిపోయారంట. సాధారణంగా ఈపోటీలో 500 మంది పాల్గొంటుంటారు. గంట 2 నిముషాల్లో... అన్ని వేల మెట్లను ఎక్కి రికార్డు సృష్టించిన వారు కూడా వున్నారు.

తాబేలు టాక్సీ

ఈపాటికే మీకు విషయం అర్థమైపోయి వుంటుంది. అవును ఈ టాక్సీలు పేరుకు తగ్గట్టే వుంటాయి. నిదానమే ప్రధానం అన్న సూత్రాన్ని నమ్మడమే కాక అమలు కూడా చేస్తున్నారు వీటి యజమానులు. నిజానికి జపాన్‌లో 2013లోనే ఈ టాక్సీలు వాడుకలోకి వచ్చినా... ఇప్పుడు వాటి పేరు మారు మోగిపోతోందనుకోండి. గర్భిణిలు, చంటిపిల్లల తల్లులు, స్కూలు పిల్లల తల్లులు, వృద్ధులు, పర్యాటకులు ఈ తాబేలు టాక్సీలను బాగా ఇష్టపడుతున్నారట. మరి కారులో కూర్చున్నాక రయ్యిమని నేలమీద విమానంలా పోతుంటే చిన్నారులకు, వృద్ధులకు ఇబ్బంది కదా. అందుకే వీటికి అంతటి ప్రాధాన్యత లభిస్తోంది. 'సాన్వా కోత్సు గ్రూప్' యజమానికి మొత్తం 500 క్యాబ్‌లుండగా వాటిలో పదింటిని తాబేలు టాక్సీలుగా మార్చేశాడు. మొత్తంమీద వీటికి మంచి స్పందన వస్తోందని వినికిడి.

బాధాతప్తాక్షర 'దర్పణం'

ఆలూరు బ్రదర్స్‌కు ఈ కవితా సంపుటిని కవి వీరభద్రాచారి అంకితం చేశారు. డా॥ రాపాక ఏకాంబరాచార్యులు మున్నుడి రాశారు. వీరభద్రాచారిగారు గ్రామీణ వైద్యం కూడా చేసేవారు. శివారెడ్డి కవిత్వంలో ప్రతీకలు– పరిశీలన అంశంపై పరిశోధన చేసి తెలుగు యూనివర్శిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. శివారెడ్డి కవిత్వ తత్వదర్శనంపై డిలీట్ చేస్తున్నారు వీరభద్రాచారి. విశ్వకళాపీఠం ద్వారా సాహిత్య అవార్డులు 2000 సంవత్సరం నుండి ఇస్తున్నారు. 'దర్పణం' అనే ఈ కవితా సంపుటిలో పదునైన భావ ప్రతీకల్తో చక్కటి వస్తు వైవిధ్యంతో ఈ కవితలు పాఠకుల్ని అలరిస్తాయి. వీరి కవిత్వంలో శక్తివంతమైన ఈ క్రింది వాక్యాలు చూద్దాం. 'ఇంటింటికి అల్లుకుపోయింది టి.వి వ్యాధి. అదిప్పుడు టి.బి వ్యాధికన్నా

దర్పణం, కవి :డా॥ ఎ.వి వీరభద్రాచారి, పేజీలు : 146. వెల : 100/-, ప్రతులకు : LIGH 48/4- 3rd ఫేజ్ KPHB కాలనీ, కూకట్‌పల్లి - హైదరాబాద్ 72- సెల్: 9391310886. విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, దిశ, నవోదయ పుస్తక విక్రయ కేంద్రాల్లో.

భయంకరమైంది" అంటారు 'నాన్నా! క్షమించు' కవితలో (పేజీ. 13). నెట్ : పాశ్చాత్య విష సంస్కృతి వికృత విన్యాసాల్ని చెప్పారు. 'గతం కొనసాగింపే వర్తమానం' అనే కవితలో పోరాటాల ఆవశ్యకతను అక్షరీకరిస్తూ ఇలా అంటారు కవి:

'ఆత్మ నిబ్బరాన్నీ, ఎదురీదే సాహసాన్నీ!
నీ భుజం నువ్వు తట్టుకొని లేచి
నిలబడాలి, నిలదొక్కుకోవాలి
దుఃఖంతో కుంగిపోతే లాభం ఏముంది?
పోరాడితే పోయేదేముంది! ఒక చరిత్రగా మిగులుతావ్! (పేజీ 19)
'జీవితాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నా!

జీవితం సక్రమ దిశలో సాగాలన్నా యుద్ధం అవసరమే!' అంటారు 'యుద్ధం' కవితలో (పేజీ. 33). అలాగే నాటకరంగ కళాకారుని జీవితాన్ని తెలిపే కవిత 'కొత్త నాటకం' తరాలు మారినా నాటకం మారలేదు/ అప్పటి నుండి ఇప్పటివరకు వేస్తూనే ఉన్నారు/ కళాపోషణ చేస్తూనే ఉన్నారు/ బడుగు జీవులు బలైపోతున్నారు!

మళ్లా కొత్త తరం – కొత్త నాటకంతో/ జనాల్ని ఉత్తేజపరుస్తూనే ఉన్నారు? (పేజీ. 40) తెరుచుకున్న ఉదయపు కిటికీ/ ధాత్రిలో ఒకరాత్రి/ కలం కత్తి/ కదలి వెళుతున్న కళాకారుడు/ ఈ దేశంలో మొలుస్తున్న మొనగాడు/ నాకలం మూడో నేత్రం/ గాయం/ కవితలు పాఠకుల్ని, కవితాప్రియుల్ని ఆలోచింపజేస్తాయి. పుస్తకం చివరలో విశ్వకళా పీఠం గురించి సుంకోజి దేవేంద్రాచారి అభిప్రాయం కవి సాహిత్య సేవను తెలియజేస్తుంది.

- ప్రసన్న కుమారి

అక్షరంతో పోరాట 'విన్యాసం'

సామాజిక దృష్టి అవగాహన గల కవి ఏదైనా నిశితంగా పరిశీలించడమేగాక నిపుణంగా రాయగల శక్తి కూడా సంతరించుకోవచ్చనడానికి ఈ సంపుటియే సాక్షి అంటారు సాహితీ స్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి తన ముందుమాటలో. శూన్యంగా మారిందన్న ప్రగతిశీల సాహిత్య రంగం ప్రపంచీకరణ వ్యతిరేక ఎజెండాతో ప్రతిధ్వనించింది. 1991 సంవత్సరంలో సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో చేసిన విష ప్రయోగం నేటికీ దుష్ఫలితాలిస్తూనే ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలు మూత/ పరిశ్రమల మూత/ వస్తు వ్యామోహం: మార్కెట్ శక్తుల



విన్యాసం, రచన : కెంగార మోహన్, పేజీలు : 115, వెల : 80/-, ప్రతులకు : సాహితీ స్రవంతి - 78/117- డి. కృష్ణానగర్- కర్నూలు- 518002, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు. సెల్ : 9493375447.

విజృంభణ/ బహుళజాతి కంపెనీల దోపిడి/ షాపింగ్‌మాల్స్ ఆగమనం/ ఆర్థిక వ్యవస్థను సామాన్యుల బ్రతుకుల్ని ఛిన్నాభిన్నం చేసే పాలకుల విధానాలపై కెంగార మోహన్ సంధించిన కవితాస్త్రాల్లో కొన్ని చూద్దాం. 'గ్లోబల్ చీకట్లో చేసే/ మాయా వ్యాపారాల్లో/ నేడు డిమాండున్న వస్తువు 'మనీ'షి– అంటారు. (పేజీ. 11)

అలాగే 'జీవచ్ఛవం' కవిత (పేజీ. 14)లో కవి ఇలా అంటారు. 'మస్తిష్కంలో దాగిన ప్రశ్నలకు/ జవాబులన్నీ/బహుళజాతి నిఘంటువుల్లో లభిస్తాయి!/ అన్నీ వాడి పరమయ్యాక/ జీవచ్ఛవం కాక ఏమవుతాం?/ 'ఆడతనం' అనే కవితలో 'పేజీ. 102) కవి సరోగసీ మదర్స్‌పై చక్కటి కవిత రాశారు. 'అమ్మే అమ్మకానికొస్తే/ మాతృత్వం అద్దెకు రాదా?/ ఆకలి దప్పులకు పరిష్కారం/ సరోగసీ అయినప్పుడు సంఘం వేసే ప్రశ్నలు/ కర్ణభేరిలోకి వెళ్లవు అంటూ చివర్లో ఇలా రాశారు. నవమాసాలు మోస్తున్నది/ శిశువును కాదు/ విశృంఖల రాక్షస గ్లోబల్ బిడ్డను/ నోటుకు విలువలు అమ్ముడుబోతుంటే/ ఆడతనం అంగడి సరుకవ్వదా? అని కవి ప్రశ్నలు సంధిస్తారు? మూడో ప్రపంచ యుద్ధం/ ఇంటింటి రాకాసి/ అజెండా/ విముక్తిపోరు/ రోలు, రోకలి/ రోబో/ డెత్ మార్చ్/ గ్లోబల్ శారద/ కవితలు పాఠకుల మెదళ్లకు పదును పెడతాయి. సాహితీ స్రవంతి – కర్నూల్ శాఖ ప్రచురణల్లో ఉత్తమ కవితా సంపుటి ఇది.

- తంగిరాల చక్రవర్తి

అలరించే 'ముఖ చిత్రాలు'

కవయిత్రి బషీరున్నీసాబేగం తన తల్లిదండ్రులు షేక్ అబ్దుల్ రజాక్, షేక్ ప్యారీజాన్ గార్లకు ఈ కవితా సంపుటి అంకితం చేశారు. అంతర్‌చిత్రం అంటూ ప్రముఖ కవి డా॥ ఎన్.గోపి చక్కటి ముందుమాట రాశారు. రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, డా॥ రామడుగు వెంకటేశ్వరశర్మ, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి కూడా పరిచయంగా పీఠికలు రాశారు. రెంటాల తన పీఠిక చివర కవులకు, కవయిత్రులకు, రచయితలకు శిరోధార్యమైన వాక్యాలు రాశారు.

'మీ జీవితం నుంచీ, మీ గాధ అనుభవాల్నుంచీ, సమాజం మిమ్మల్ని స్పృశించిన చోటు నుంచీ కవిత్వాన్ని బయటకు తీసుకురండి– మరింత బావుంటుంది మీ కవిత్వం" నిజమే కదా! ఈ

ముఖ చిత్రాలు, కవయిత్రి - షేక్ బషీరున్నీసా బేగం, పేజీలు : 112, వెల : 100/-, ప్రతులకు : హౌస్ నెం : 5-66-81-ఫస్ట్‌లైన్, గుంటూరు-522002. సెల్ 9985193970.

కవితలన్నీ ఆంధ్రభూమి, ఆంధ్రప్రదేశ్, మల్లెపందిరి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, ప్రజాశక్తి, విశాలాంధ్ర లాంటి పత్రికల్లో ప్రచురణలు అయినవి. మరికొన్ని వివిధ పోటీల్లో బహుమతులు గెల్చుకొన్నవి ప్రచురించబడ్డాయి. మన్మోహన్‌సేవ (ఎఫ్.డి.ఐ) అన్న కవితలో కవయిత్రి ఇలా అంటారు. (పేజీ. 49) 'వాల్‌మార్టులు మన వీధుల్లో వాలిపోతారంట/ వ్యాపారపు చిత్రాలు చిత్రంగా చేస్తారంట/ మాలుల్లోన నీవు సేల్స్ బోయ్‌గా చేరలేవు/ వీధి బండిపైన గరం బజ్జీలు అమ్మలేవు/ గ్యాసు, బొగ్గు, నీరు, నూనెల్లోన వాటాలు ఇచ్చారు/ చేతకాని మేధావులు చోద్యాలే చూసేరు. ఇలా పాలకవర్గాల దోపిడి, ఎండగట్టిన తీరు ప్రశంసనీయం. ప్రపంచీకరణ దుష్ఫలాలు కవిత్వీకరించాలి. 'కర్తవ్యం' అనే కవిత (పేజీ. 71) చివరలో సమిష్టి పోరాటోద్యమాల ఆవశ్యకతను చక్కగా చెప్పారు కవయిత్రి." చపలత్వం వదిలించాలి సత్వరం/ కాముకత్వం విడనాడాలి ఈతరం/ ప్రక్షాళనే ప్రస్తుత కర్తవ్యం/ ఉద్యమంగా కదులుదాం అందరం!" సంపుటి టైటిల్ పెట్టిన 'ముఖ చిత్రాలు' కవితలో కవయిత్రి చక్కటి భావస్ఫోరక పదాల్తో ఇలా అంటారు.

'ముఖంపై మోడరన్ ఆర్ట్ చెరుపగలేవు/ లోతుగా తొంగిచూసి చదువుగలేవు/ అంతర్ చిత్రమెన్నటికీ అగుపించదు/ చితి మంటలలో కాలే వరకు (పేజీ. 34) మనిషి మరణం నేపథ్యంలో ఉన్నప్పుడు జీవితం వేరేగా అర్థం అవుతుంది అనే భావాన్ని రాశారు. చాలా కవితల్లో ధర్మాగ్రహం స్త్రీ కోణంలో సమస్యల్ని చూడటం కనిపిస్తాయి. ప్రకృతిని రక్షించాలనే గొప్ప సందేశం బాగుంది – దాదాపు 60 కవితలున్న ఈ సంపుటి కవితాప్రియుల్ని అలరిస్తుంది.

-టి.సి.

బెంగాల్ తాజా పరిణామాల అవగాహనకు ....

పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ పాలన తీరుతెన్నుల గురించి వామపక్ష సంఘటన రూపొందించిన పుస్తకమిది. మొదటి ఏడాది అనుభవాలే దీనిలో పొందుపరచబడ్డాయి. ఏ ప్రభుత్వం గురించి అయినా ఓ అంచనాకు రావాలంటే ఏడాదికాలం సరిపోదు. కాని ఆ పాలన ఏ దిశగా వెళుతున్నదో తెలుసుకోవడానికి అది సరిపోతుంది. అందుచేతనే వామపక్ష సంఘటన 1977లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పాలనలో సాధించిన వాటిని కూడా సంక్షిప్తంగా దీనిలో ఇచ్చారు. సిపిఐ(ఎం) కేంద్ర పత్రిక 'పీపుల్స్ డెమొక్రసీ'లో ఇచ్చిన ప్రకారం, '2011 మేలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2012 డిసెంబరు 31 నాటి వరకు 85 మంది సిపిఎం కామ్రేడ్లు తృణమూల్ గూండాల చేతిలో హతులయ్యారు. మహిళలపై 848 హింసాత్మక దాడులు జరిగాయి. 129 మంది దారుణంగా మానభంగాలకు గురయ్యారు... ఈ

మమత అరాచక పాలనలో పశ్చిమబెంగాల్ పయనం ఎటు?, బెంగాలీ నుండి తెలుగు అనువాదం : వేదుల రామకృష్ణ, వెల : రూ. 70/-, పేజీలు:166, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107.

కాలంలోనే 42,724 మంది సిపిఐ(ఎం), వామపక్షాలకు చెందినవారు, సానుభూతిపరులు ఇళ్ల నుండి తరిమివేయబడ్డారు. తృణమూల్ గూండాలు 3000 ఇళ్లను తగులబెట్టారు. లూటీ చేశారు. 222 ట్రేడ్ యూనియన్, ఇతర ప్రజాసంఘాల కార్యాలయాలు బలవంతంగా స్వాధీనం చేసుకోబడ్డాయి. ఈ కాలంలో తృణమూల్ దౌర్జన్యాలకు, దాడులకు పరాకాష్ట అని చెప్పదగింది సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు, మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అబ్దుర్ రజాక్‌పై జనవరి 6న తృణమూల్ రౌడీమూకలు జరిపిన అమానుష దాడి. గత నలభైఏళ్లుగా నిరంతరాయంగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతున్న అత్యంత ప్రజాభిమానం కలిగిన నేత ఆయన. అలాంటి వ్యక్తి కిసాన్‌సభ జిల్లా మహాసభకు హాజరయ్యేందుకు వెళుతూ దారిలో తృణమూల్ దాడులకు గురైన పార్టీ కార్యాలయాన్ని చూడటానికి వెళ్లినప్పుడు ఈ దాడి జరిగింది. దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దగ్గరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయనను చికిత్స కోసం చేర్పించగా తృణమూల్ వారు ఆయనను బలవంతంగా డిస్‌చార్జి చేయించారు. ఈ దాడికి నిరసనగా సిపిఐ(ఎం) 50 వేల మందితో జరిపిన నిరసన ర్యాలీపై రజాక్ చేతిలో ఓటమి పాలైన తృణమూల్ అభ్యర్థి అరబుల్ ఇస్లాం నాయకత్వంలో దాడి జరిగింది. ఈ దాడిలో 20 వాహనాలు దగ్ధం చేయబడ్డాయి. 27 మంది గాయాలపాలయ్యారు. ముగ్గురికి బుల్లెట్ గాయాలయ్యాయి. దీనంతటికి కారణమైన వారంతా స్వేచ్ఛగా తిరుగుతుండగా, దాడికి గురైన సిపిఐ(ఎం) వారిపైనే తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయించారు. రజాక్‌పై దాడికి అసలు కారణం ఆయన బెంగాల్ భూసంస్కరణల మంత్రిగా ఉన్నప్పుడు భూస్వాములు అక్రమంగా అనుభవిస్తున్న భూములను స్వాధీనం చేసుకొని అర్హులకు పంచడమే. ఆయనపై కక్ష పెంచుకున్న భూస్వాములు ఈ దాడుల వెనుక ఉన్నారు. పైన పేర్కొన్న అంశాలన్నీ మమత పాలన తీరును మచ్చుకు వివరించేవి మాత్రమే. ఈ ధోరణి ఆగకపోగా మరింత తీవ్రంగా, విస్తృతంగా కొనసాగుతూనే ఉంది. మరోవైపున మమత పట్ల భ్రమలు పెంచుకొని మద్దతిచ్చిన అనేకమంది ఈ కాలంలో వాటిని విడనాడుతున్నారు. బెంగాల్ తాజా పరిణామాల అవగాహనకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

- స్నేహ

తాళంచెవి ఏది?



నేస్తాలూ! ఇక్కడ ఒక తాళం, మూడు తాళంచెవులు వున్నాయి. తాళంచెవులు అన్నీ ఒకేలా ఉన్నా ఒక్కటే దానికి సరిగ్గా సరిపోతుంది. మరి ఆ తాళంచెవి ఏదో కనిపెట్టండి చూద్దాం!

జత చేద్దాం!

ఈ వస్తువుల్ని దేనికేది ఉపయోగిస్తారో జత చేయండి.

ఎలుకల లెక్క



ఈ బొమ్మలో ఎన్ని ఎలుకలున్నాయో లెక్క పెట్టండి. ఆ తర్వాత మా జవాబుతో సరిచూసుకోండి.

వరుస క్రమంలో...

పిల్లలూ ఇక్కడ బుజ్జిగాడి బొమ్మలు నాలుగున్నాయి. అయితే అందులో వాడు చేస్తున్న పనులను బట్టి ఒక క్రమంలో ఉంచాలి.

చుక్కలు కలిపేద్దాం



పదాలెక్కడ?



A	K	O	L	I	M	E	C
B	I	R	E	G	E	P	A
F	W	A	M	R	L	E	P
R	I	N	P	A	O	A	R
U	F	G	L	P	N	R	I
I	N	E	U	E	L	G	C
T	L	E	M	O	N	E	O
S	C	H	E	R	R	Y	T

SEE IF YOU CAN FIND THESE WORDS!

FRUITS APPLE ORANGE MANGO
APRICOT PEAR MELON CHERRY
KIWI LIME PLUM LEMON FIG

పై గళ్లలో ఇంగ్లీషు అక్షరాలున్నాయి కదా! వాటిల్లో కింద ఇచ్చిన పండ్ల పేర్లు దాక్కున్నాయి. గబగబా కనుక్కోండి.

నీడ ఏదోచ్



ఆకులు, వాటి నీడలు ఉన్నాయి కదా! మరి ఏ ఆకు నీడ ఏదో కనిపెట్టండి.

దాక్కున్నాయ్!

పక్కనున్న పది వస్తువులు పెద్ద బొమ్మలో దాక్కున్నాయ్. వాటిని కనిపెట్టి సున్నా చుట్టండి.

గులాబీ గీద్దామా

తుపాను పేరు ఏదైతేనేం

ఒక్కో తుపాను ఒక్కో పేరు
పేరు ఏదైతేనేం
ఫైలాన్ హుద్‌హుద్ విధ్వంసం దాని వికృతం
కొందరు సముద్రాన్ని తల్లిగా కొలుస్తారు
కొందరు సముద్రాన్ని తండ్రిగా ఆరాధిస్తారు
బిడ్డల్ని పొట్టన బెట్టుకోవటం
సమస్తం ధ్వసించటం
ఈ తల్లి తండ్రీ ప్రత్యేకత!
నీళ్లలో నాని నాని
చలిని తట్టుకోలేని సముద్రుడు
పవనుడు వరుణుడితో కూటంగట్టి
సంఘర్షణకు సంఘటిత బలంతో
ఒక్కసారిగా నేలపై ఉప్పెనౌతాడు
ప్రచండ గాలులు రాకాసి అలలు
అతలాకుతలం చేస్తాయి
శతాబ్దాల చరిత్రకు
నిలువెత్తు సాక్ష్యాలు చెట్లు నేలకూల్తాయి
రహదారుల్ని ఛిద్రం చేస్తూ
వంతెనలు నీటితో కలిసి నడుస్తాయి
వెలుగు చిమ్మిన విద్యుత్తు స్తంభాలు
శివధనుర్భంగాన్ని మరపిస్తాయి
పండిన పంట నారుమళ్లవుతాయి
పూరి కప్పులు తెగిన గాలిపటాలౌతాయి
తాటాకు గుడిసెలు విసనకర్రలౌతాయి
నీళ్ల పాలు నిత్యావసర సరుకులు
కనుమరుగౌతాయి
మనిషి కాలిడని
మరో గ్రహంలో వున్నట్లు ప్రజలు భావిస్తారు
హాహాకారాలు ఆక్రందనలు రోదనలు
ఏడ్పులు పెడబొబ్బలు
వీక్షించిన ప్రయోక్తలు నడుంబిగిస్తారు
సమూహాల్ని సంఘటితం చేస్తారు
చెయ్యెత్తుతారు స్తంభాలు లేస్తాయి
రుద్రనేత్రం విప్పుతారు లైట్లు వెలుగుతాయి
కేకేస్తారు ఫోన్లు ప్రతిధ్వనిస్తాయి
కూలిన వెంతెన నిలుస్తుంది
చెదిరిన రహదారి స్వాగతిస్తుంది
శిథిల గృహాలు లేస్తాయి
పసిమిని పోగొట్టుకున్న సస్యశ్యామలం
మారాకు తొడుగుతుంది
పాలు ఇంటింటి తలుపు తడుతుంది
నిత్యావసరాలు వాకిట నిలుస్తాయి
నిలదొక్కుకున్న సముద్రుడు నివ్వెరపోతాడు
విధ్వంసంలో నిర్మాణం చూస్తాడు
ఓటమి అంగీకరిస్తాడు
మానవుడు అజేయుడంటాడు!

అడిగోపుల వెంకటరత్నమ్
ఫోన్: 9648252946

రచనలకు ఆహ్వానం



ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించీ రాసి పంపవచ్చు. మట్టిలో మాణిక్యాల్లా స్వశక్తితో విజయాలు సాధించినవారి గురించీ పంపవచ్చు. ఒకవేళ అవేవీ రాయలేకపోయినా సలహాలు, సూచనలు ఇచ్చినా సంతోషమే. వారికీ ఆహ్వానం. స్నేహ పత్రికలో ఇప్పుడు వస్తున్న అంశాలు కాకుండా ఇంకా సమయానుకూలంగా ఇదిగో ఇవి వస్తే బాగుంటాయి. అని మీకనిపిస్తే మాకు తెలియచేయండి. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్.

రచనలను పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1,
ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

మేం కాని... మీసం మెలేశామో...

గడ్డాలు, మీసాలు వున్న వాళ్లని చూసినప్పుడు అనుకుంటుంటాం. అబ్బో... పోషణ ఎంత కష్టమో అని. జడల మాదిరిగానే ... గడ్డాలు మీసాల నిర్వహణకు తిప్పలు పడతారంతే. ఎన్నన్నా చెప్పండి గడ్డాలు మీసాల వల్ల ఉపయోగం ఏముంది చెప్పండి? చిరాకు తప్ప! అంటారేమో! వీటికి సంబంధించి ప్రపంచ పోటీలు, విజేతల ప్రకటనలు, టీవీలు-పత్రికల్లో కథనాలు, ఇంటర్వ్యూలు... అంటే మాటలా చెప్పండి!

అందమైన గడ్డం, మీసం పోటీలు ప్రతి సంవత్సరం జరుగుతాయి. ఈ ఏడాది పోర్ట్‌లాండ్‌లోని కెల్లర్ ఆడిటోరియం దీనికి వేదికైంది. మొత్తం మూడు వేల మంది కూర్చుని చూడగల పెద్ద ఆడిటోరియం అది. ప్రపంచం నలు మూలల నుంచి 300 మంది పాల్గొన్నారు. పోటీలో పాల్గొనాలనుకునే వారు ముందుగానే తమ పేరును నమోదు చేయించుకోవాలి. అందుకుగాను యాభై డాలర్ల రుసుము చెల్లించాలి. ప్రేక్షకులు సైతం పది డాలర్లు కట్టి మరీ లోపలికి అడుగెట్టాలి. మొత్తం పదిహేడు విభాగాల్లో జరిగిందీ పోటీ. సహజ సిద్ధంగా పెంచుకునే గడ్డం, మీసాల పోటీ సంగతి చెప్పేదేముంది? రకరకాల నూనెలు, రసాయనాలు, క్లిప్పుల సాయంతో అలంకరించిన గడ్డాలతో జరిగే పోటీలు చూడాలి! చిన్నారులు ఎంతో ఇష్టంగా తినే చీటోలను... ఓ పోటీదారు తన గడ్డపు కురులకు ఎంత అందంగా గుచ్చాడో చూడండి? కొమ్ముల్లాంటి గడ్డం, సూదుల్లాంటి మీసాలు, జడ గడ్డాలు, పొద గడ్డాలు, వుంగరాల గడ్డాలు.. సృజనకు ఆకాశమే హద్దనుకోండి. అయితే అంతిమ నిర్ణయం న్యాయమూర్తులదే. ఎలాంటి చర్చలకు, ప్రశ్నలకు, వాదాలకు తావులేదు. విజేతలకు ఇచ్చే బహుమతి కూడా భారీగానే వుంటుంది. వచ్చే సంవత్సరం ఆస్ట్రియాలో జరగనున్న పోటీల్లో పాల్గొనడానికయ్యే ఖర్చంతా నిర్వాహకులే భరిస్తారు. ఆ మాత్రం ప్రోత్సాహం వుండాలేగానీ... మీసాల రాయుళ్లు రెచ్చిపోరూ!







మబ్బు బొమ్మలు

బాల్యంలో ... సాయంత్రం పూట ... అలా ఆరుబయట మంచం మీద పండుకొని ఆకాశంలోకి చూస్తుంటే... ఎన్నేసి వింతలో. విశేషాలో. కథలో. కల్పనలో. పోటీలు పడి మరీ చెప్పకుంటారు చిన్నారులు. మబ్బులు గుంపులు గుంపులుగా చుట్టాలింటికి వెళుతున్నట్టు, ఒకదాని వెంట ఒకటి పడి ఆటపట్టించుకుంటున్నట్టు, ఆ ఫైటింగ్‌లో ఒకటి రాలి నేల మీద పడిపోయినట్టు... ఎన్నని చెప్పడం? పైగా ఆ మబ్బు ముక్కలే... రకరకాల ఆకారాల్లో అగుపించి ఆశ్చర్యపరచడం... ఎంత తమాషాగా వుంటుంది?

ఇవాళ మీ ముందుకొచ్చిన మబ్బు బొమ్మలు కూడా సరిగ్గా అలాంటివే. మాడ్రిడ్‌కు చెందిన మార్టిన్ ఫిజో అనే కుర్రోడు మబ్బుల ఫొటోలు తీసి... తనకు తోచిన బొమ్మల ఆకారాలు వేసేశాడు. వాటిని ఆన్‌లైన్‌లో పెడితే చూస్కోండి?! ఎంతమంది లైక్‌లు కొట్టారనీ? గత వేసవిలో మెక్సికో వెళ్లినప్పడు ట్రాఫిక్ రద్దీగా వుండడంతో... రోడ్డుమీద ఆగాల్సి వచ్చింది మార్టిన్. అప్పడు ఇతగాడి దృష్టి ఆకాశం మీద... అక్కడ కదలాడుతున్న నీలి మేఘాలమీద పడింది. వెంటనే వాటిని తన కెమెరాలో బంధించేశాడు. ఆనక వాటిని ఇదిగో ఇలా బొమ్మల్లా తీర్చిదిద్దాడు. అలా మార్టిన్ కుంచె నుంచి జాలువారినవే ఈ శునకం, కుక్కుటం, తాబేలు, డైనోసార్, రష్యన్ తాత, చిలుక ముక్కు చేప. మబ్బు తునకల బొమ్మలు చూస్తుంటే ... మీకూ మార్టిన్‌లా ఆర్టిస్టు అయిపోవాలనిపించట్లా?!